

పేదలపై మైక్రో పడగ

విస్తరించిన సూక్ష్మ రుణ సంస్థలు





మళ్లీ మైక్రో ఫైనాన్స్ పడగ విప్పుతోంది. పదేళ్ల క్రితం పేద కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసిన ఈ సంస్థలు మళ్లీ దందా మొదలు పెట్టాయి. పేద ప్రజల అవసరాలే ఆసరాగా అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి వారి నడ్డి విరుస్తున్నాయి. హిందూపురం నియోజకవర్గంలో వేలాది కుటుంబాలు అధిక వడ్డీ చెల్లించలేక నలిగిపోతున్నాయి. 'మీరు చచ్చినా సరే.. మా సొమ్ము చెల్లించాల్సిందే..' అని ఆ సంస్థల ప్రతినిధులు బెదిరింపులకు దిగుతున్నారు. వారి వేధింపులను భరించలేక కొందరు ఆత్మహత్యకు యత్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

- హిందూపురం, ఆంధ్రజ్యోతి

- పురంలో రూ.20 కోట్లకుపైగా రుణాలు
- భారీగా వడ్డీలు.. కట్టకుంటే బెదిరింపులు
- ఇంటి వద్దకు వచ్చి బూతుపురాణం
- ఆత్మహత్యకు యత్నిస్తున్న బాధితులు

వైసీపీ హయాంలో మొదలు

హిందూపురం ప్రాంతం వాణిజ్యపరంగా పేరుగాంచింది. ఇక్కడ గార్మెంట్స్ పరిశ్రమలు విరివిగా ఉన్నాయి. వేలాది మంది మహిళలు గార్మెంట్స్‌లో పనులకు వెళుతుంటారు. పేద, దిగువ మధ్యతరగతి జనాభా గణనీయంగా ఉన్న ఈ ప్రాంతంపై కర్ణాటక, తమిళనాడుకు చెందిన మైక్రో ఫైనాన్స్ సంస్థకు గురిపెట్టాయి. కొన్ని సంస్థలు ఇక్కడే కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని రుణాలు ఇస్తున్నాయి. ఒక హిందూపురం పట్టణంలోనే రూ.20 కోట్లకు పైగా మైక్రోఫైనాన్స్ సంస్థలు అప్పులు ఇచ్చాయి. వీరు ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో డబ్బులు వసూలు చేస్తూ, బెదిరిస్తూ కనిపిస్తుంటారు. అప్పటి టీడీపీ హయాంలో వాటిని కట్టడి చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే మైక్రో ఫైనాన్స్ సంస్థలు తమ కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించి, విస్తరించాయి. కొవిడ్ తరువాత ఈ సంస్థలు అధికంగా రుణాలు ఇవ్వడం మొదలైంది.

పేదలే టార్గెట్

మైక్రో ఫైనాన్స్ సంస్థలు ప్రధానంగా పేదలను టార్గెట్ చేస్తున్నాయి. వారి నుంచి రేషన్‌కార్డు, ఓటర్ ఐడీ, ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ కాపీలను తీసుకుని రుణాలు ఇస్తున్నాయి. బ్యాంకుల్లో రుణాలు పొందాలంటే సవాలక్ష నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఖాతాలో డిపాజిట్, సిబిల్ స్కోర్, ష్యూరిటీ, నెల జీతం, ఐటీ రిటర్న్స్.. ఇలా అనేక నిబంధనలు పాటించాలి. లేదంటే ఆస్తులు, బంగారం వంటివి తాకట్టు పెట్టాలి. కానీ మైక్రో ఫైనాన్స్ సంస్థలు ఎలాంటి పూచీకత్తు లేకుండా, కేవలం ధ్రువపత్రాల నకలు తీసుకుని రుణాలు ఇస్తున్నాయి. దీంతో పేదలు వాటిని ఆశ్రయించి, అధిక వడ్డీలకు బలి అవుతున్నారు.

భారీగా వడ్డీలు..

మైక్రో ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు రుణం ఇచ్చేందుకు వచ్చినప్పుడు నెలకు వంద రూపాయలకు రూ.2 వడ్డీ అని నమ్మబలుకుతారు. రూ.50వేలు రుణం తీసుకుంటే మొదటే వడ్డీ పేరిట రూ.3 వేలకుపైగా కట్ చేసుకుంటారు. ఇన్సురెన్స్, ఇతర ఖర్చుల కింద రూ.5వేలు లాగేస్తారు. చేతికి ఇచ్చేది రూ.45 వేలు మాత్రమే. ఈ మొత్తాన్ని నెలలో రెండు విడతలుగా కట్టాలని చెబుతారు. రూ.వెయ్యి చొప్పున 60 నెలలు కట్టాలని చెబుతారు. మరికొన్ని మైక్రో ఫైనాన్స్ సంస్థలు 70 కంతుల వరకూ గుంజుతున్నాయి. చేతికి అందిన రూ.45 వేలకు ఏడాదికి రూ.20 వేల నుంచి రూ.30 వేల దాకా వడ్డీ వసూలు చేస్తున్నారు. ఒక కంతు ఆలస్యమైతే అదనంగా వడ్డీ గుంజుతున్నారు. రిజర్వ్‌బ్యాంకు నిబంధనల ప్రకారం మైక్రో ఫైనాన్స్ సంస్థలు 10 నుంచి 20 మంది మహిళలను గ్రూపుగా ఏర్పాటు చేసి, ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రుణాలు ఇవ్వొచ్చు. ఆధార్, పాన్‌కార్డు నకలు ఆధారంగా వారికి రుణాలు ఇవ్వవచ్చు. ఆర్బీఐ నిబంధనల మేరకు బ్యాంకుల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని, చట్టబద్ధంగా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు రికార్డులో చూపుతున్నారు. కానీ నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదు.

లక్ష్యం పక్కదారి

సౌత్ ఇండియా, స్పందన, కీర్తన, పిన్‌కేర్, అన్నపూర్ణ, యాక్సిస్, గ్రీస్, ఫ్యూజియన్.. ఇలా అనేక రకాల పేర్లతో మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంస్థలు చిన్న మొత్తాలలో రుణాలను ఇచ్చి, వ్యాపారాలను ప్రోత్సహించాలి. కానీ వ్యవహారాలన్నీ ఇందుకు భిన్నంగా జరుగుతున్నాయి.

రూ.20 కోట్లకు పైగా రుణాలు

హిందూపురం పట్టణంలో పేదలు నివసించే సుమారు 20 కాలనీలలో సూక్ష్మ రుణాలను భారీగా ఇచ్చారు. సుమారు ఐదు వేల మందికి రూ.20 కోట్ల వరకూ రుణాలు ఇచ్చి ఉంటారని అంచనా. పట్టణ సమీప ప్రాంతాలకు సైతం ఈ వ్యాపారం విస్తరించింది. హిందూపురంలో ఏటా రూ.వంద కోట్లకుపైగా రుణ లావాదేవీలు జరుగుతున్నాయని సమాచారం. అధిక వడ్డీలు చెల్లించలేక, అప్పు తీర్చడానికి మరో అప్పుచేసే వారు ఎక్కువగా ఉన్నారు. అన్నీ తడిసి మోపెడై.. ఒత్తిడి భరించలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పట్టణంలోని హస్నాబాద్‌లో గురువారం ఓ మహిళ మైక్రో ఫైనాన్స్ వారి వేధింపులు భరించలేక ఆత్మహత్యకు యత్నించారు. ఇలాంటి చాలా సంఘటనలు బయటకు రావడం లేదు.



వేధిస్తే చర్యలు..

మైక్రో ఫైనాన్స్ రుణాలు సక్రమంగా చెల్లించకపోతే కోర్టు ద్వారా వసూలు చేసుకోవాలి. ఇళ్లవద్దకు వెళ్లి వేధింపులకు పాల్పడకూడదు. వేధింపుల కారణంగా ఏదైనా ఆత్మహత్య చేసుకున్నా, ఇబ్బందులు ఎదుర్కొన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆధార్, పాన్‌కార్డు, పింఛన్ కార్డు, రేషన్‌కార్డు బ్లాక్ చేస్తామని బ్లాక్‌మెయిల్ చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయి. నిబంధనల ప్రకారమే ఇచ్చిన రుణాన్ని వసూలు చేసుకోవాలి.

- మహేష్, డీఎస్పీ



బెదిరిస్తారు..

మైక్రో ఫైనాన్స్ సంస్థ ద్వారా తీసుకున్న రుణానికి సంబంధించి కంతు కట్టడం ఒక రోజు ఆలస్యమైనా ఫోన్‌చేస్తారు. మీ పాన్‌కార్డు, ఆధార్, రేషన్‌కార్డు బ్లాక్ చేస్తామని బెదిరిస్తారు. చేసేదిలేక మరోచోట అప్పుచేసి కంతు కట్టాల్సి వస్తోంది.

-భారతి, హిందూపురం



దుర్భాషలాడతారు..

గ్రూపులో ఉన్న పది మందిలో ఏ ఒక్కరు కంతు కట్టకపోయినా అందరినీ దుర్భాషలాడుతారు. బూతులు తిడతారు. ఇళ్ల వద్దకు వచ్చి వేధిస్తారు. డబ్బులు కట్టేవరకు ఇంటివద్ద నుంచి కదలరు. మర్యాద పోతుందని ఎలాగోలా డబ్బులు చెల్లిస్తుంటాము.

-శశికళ, హిందూపురం



చచ్చినా సరే కట్టాలంట

మైక్రో ఫైనాన్స్‌లో తీసుకున్న రుణం కంతు ఒక్క రోజు కూడా ఆలస్యంకాకుండా చెల్లించాలి. లేదంటే ఇళ్ల వద్దకు వస్తారు. ఇంట్లో కూర్చుని, చచ్చినా సరే కట్టాల్సిందే అని మొండికేస్తారు. అర్ధరాత్రైనా ఇంటి నుంచి వెళ్లరు. వారికి భయపడి కంతులు కడుతున్నాము. అయినా వేధింపులు ఆగడం లేదు.

-మునిలక్ష్మి, హిందూపురం

ఇంటికి వెళ్లి వేధింపులు

- హిందూపురం మోడల్ కాలనీలో ఓ మహిళ తన భర్త ఆటో మరమ్మతుల కోసం మైక్రోఫైనాన్స్‌లో రూ.30 వేలు రుణం తీసుకున్నారు. ఆటోకు బాడుగలు సరిగా దొరక్క కంతులు కట్టలేదు. దీంతో ఫైనాన్స్‌వారు ఇంటి వద్దకు వచ్చి బెదిరించారు. చేసేదిలేక చెవిలో ఉన్న కమ్మలు అమ్మేసి కంతులు చెల్లించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని హస్నాబాద్‌లో ఓ మహిళ మైక్రోఫైనాన్స్ నుంచి రూ.2 లక్షల దాకా రుణం తీసుకున్నారు. ఇప్పటి వరకు రూ.50 వేల దాకా చెల్లించారు. అది వడ్డీకి సరిపోయిందని ఫైనాన్స్ సిబ్బంది చెప్పారు. ప్రతి రోజూ ఇంటివద్దకు వచ్చి వేధిస్తుండటంతో ఆమె గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.


- హిందూపురం మండలం పూలకుంటకు చెందిన ఓ వ్యక్తి తన భార్య పేరిట ఫైనాన్స్‌లో రూ.50వేలు రుణం తీసుకున్నారు. తన బిడ్డల చదువుకు ఆ సొమ్ము ఖర్చుపెట్టాడు. ఆయన భవన నిర్మాణ కార్మికుడు. ఆరునెలల క్రితం వరకు భవన నిర్మాణ పనులు జరగలేదు. దీంతో రుణం కంతులు సరిగా కట్టలేకపోయారు. ఫైనాన్స్ సిబ్బంది ఇంటివద్దకు వెళ్లి వేధిస్తుండటంతో దంపతుల మధ్య గొడవ జరిగింది. భార్య పుట్టింటికి వెళ్లిపోయారు. ఈ పంచాయితీ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది.
- హిందూపురంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కార్మికుడు ఆరునెలల క్రితం కుటుంబ పోషణ కోసం రూ.40 వే లు రుణం తీసుకున్నాడు. ఆ యనకు పని దొరక్క కంతులు సరిగా చెల్లించలేదు. ఫైనాన్స్ ఇచ్చినవారు ఇంటివద్దకు వచ్చి అర్ధరాత్రి వరకు వేధించారు. చేసేదిలేక తన ద్విచక్రవాహనాన్ని అమ్మేసి కంతులు చెల్లించాడు.

పది పరీక్షలకు

పకడ్బందీ ఏర్పాట్లు

● డీఈఓ కిష్టప్ప

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కొత్తచెరువు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని డీఈఓ కిష్టప్ప తెలిపారు. పరీక్షా కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పరీక్షల నిర్వహణపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న: పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీఈఓ: మార్చి 17నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలో మొత్తం పరీక్షా కేంద్రాలు ఎన్ని..? ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు..?

డీఈఓ: జిల్లా వ్యాప్తంగా 449 పాఠశాలలకు చెందిన విద్యార్థులు 104 సెంటర్లలో పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రైవేటు పాఠశాల విద్యార్థులు 1435 మంది, ప్రభుత్వ పాఠశాలల నుంచి 22,295 మంది, ఒకేషనల్ నుంచి 642 మంది పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న: సమస్యాత్మక పరీక్షా కేంద్రాలు ఎన్ని ఉన్నాయి? అక్కడ ఎలాంటి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు..?

డీఈఓ: జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలు ఆరు ఉన్నాయి. అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. సిట్టింగ్‌స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తాం. జిల్లాలో 47 ఏ సెంటర్లు, 57 బీ సెంటర్లు ఉన్నాయి.

ప్రశ్న: గతంలో కదిరి ప్రాంతంలో పరీక్షా పేపర్ లీక్ అయింది. అక్కడ ఈసారి ఎలాంటి భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు?

డీఈఓ: గతంలో కదిరి, గాండ్లపెంటలో పరీక్ష పేపర్ లీక్ అయిన మాట వాస్తవమే. పొరపాట్లు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నాం. కదిరి ప్రాంతంలో పోలీసులు, జిల్లా విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక నిఘా ఉంచుతాం.

ప్రశ్న: వందరోజుల యాక్షన్ ప్లాన్ ఏవిధంగా జరుగుతోంది..? స్టడీ అవర్స్ విజిట్ చేస్తున్నారా..?

డీఈఓ: పదిలో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రభుత్వం వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసింది. దీంతో స్టడీ అవర్స్ కింద ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఎంఈఓలు, నేను కూడా విజిట్ చేస్తూ తగిన సూచనలు చేస్తున్నాం.

ప్రశ్న: కొంతమంది ఉపాధ్యాయులు స్టడీ అవర్స్‌కు హాజరు కాలేదని తెలుస్తోంది? మీ దృష్టికి వచ్చిందా..?

డీఈఓ: కొందరు ఉపాధ్యాయులు స్టడీ అవర్స్‌క హాజరు కాలేదని మా దృష్టికి వచ్చింది. హాజరు కాని ఉపాధ్యాయులకు మెమో జారీ చేశాం.

ప్రశ్న: పరీక్షలకు ఎంత మంది సిబ్బందిని నియమిస్తున్నారు..?

డీఈఓ: జిల్లాలో 104 పరీక్షా కేంద్రాలకు 104 చీఫ్ సూపరింటెండెంట్లను నియమించాం. డిపార్ట్‌మెంట్ అధికారులు 127 మందిని, అడిషనల్ డిపార్ట్‌మెంట్ అధికారులు 23 మంది, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆరుగురు, సిట్టింగ్ స్క్వాడ్‌ను సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: కేంద్రాల్లో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

డీఈఓ: పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు ఏర్పాటుతోపాటు వైద్య సిబ్బందిని నియమిస్తాం. పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తాం. ఆర్టీసీ అధికారులతో సంప్రదించి విద్యార్థులకు ప్రత్యేక బస్సుల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం, పరీక్షా సమయంలో జిరాక్స్ సెంటర్లు తెరవకుండా నిర్వాహకులకు నోటీసులను అందజేస్తాం.

ఈజీ గురూ..!

బావుల వద్ద కేబుల్ మాయం

ఆలయాల్లో హుండీ, ఆభరణాలు లూటీ

ఒక్క కేసూ ఛేదించని పోలీసులు

జిల్లావ్యాప్తంగా సులభంగా చోరీలు



ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వంసం చేసిన హుండీ

ధర్మవరం రూరల్/హిందూపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వరుస చోరీలతో జిల్లా వ్యాప్తంగా దొంగలు చెలరేగిపోతున్నారు. పొలాలను లక్ష్యంగా చేసుకుని వ్యవసాయ పరికరాలను చోరీచేస్తున్నారు. ఆలయాలలోకి చొరబడి హుండీలు, దేవతామూర్తుల ఆభరణాలను ఎత్తుకుపోతున్నారు. పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు మాయమౌతున్నాయి. గడిచిన నాలుగు నెలలుగా ధర్మవరం మండలంలో వరుస చోరీలు జరుగుతున్నా.. పోలీసు యంత్రాంగం ఒక్క చోరీ కేసును కూడా ఛేదించలేదు. హిందూపురం ప్రాంతంలోనూ పురోగతి కనిపించడం లేదు. గస్తీ, సీసీ కెమెరాల ఏర్పాటు, కేసుల ఛేదన గురించి పోలీసు శాఖ ఉన్నతాధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పొలాలు, ఆలయాల్లో జరిగిన చోరీల కేసులు చాలా పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉండిపోయాయి. దేవదాయశాఖ సైతం ఆలయాల భద్రత గురించి పట్టనట్లు వ్యవహరిస్తోందని భక్తులు అంటున్నారు. అందుకే దొంగలపని సులభంగా మారిందని అంటున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి..

ప్రతి ఆలయంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఆలయ భద్రతకు భక్తులతో విరాళాలు సేకరించి కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలి. హుండీలు ఉన్న ఆలయాల్లో అర్చకులు, ఆలయ కమిటీకి సంబంధించినవారు రాత్రిపూట పడుకోవాలి. ఆలయానికి సంబంధించి హుండీలో ఎక్కువ మొత్తం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

- మహేష్, డీఎస్పీ, హిందూపురం

ఆలయాలు లూటీ

- ధర్మవరం మండలం రాంపురం వద్ద సత్యమ్మ దేవాలయంలో 130 తులాల వెండి ఆభరణాలు, రూ. 30వేల నగదు చోరీ జరిగింది.
- గొట్లూరు గ్రామంలోని మహంకాళమ్మ, పెద్దమ్మ దేవాలయాల్లో బంగారు మంగళసూత్రంతో పాటు రూ.80వేల చోరీ చేశారు.
- కొద్దినెలల క్రితం హిందూపురం-సోమందేపల్లి మండలాల సరిహద్దులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో తలుపులు పగలకొట్టి సొమ్ము ఎత్తుకెళ్లారు.
- గత నెలలో సంతేబిదునూరు ఆంజనేయస్వామి ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నా దొంగలు హుండీని పగలకొట్టి సొమ్మును దోచుకెళ్లారు.
- రెండు నెలల క్రితం లేపాక్షి మండలంలోని పురాతన ఆలయంలో తలుపులు పగలకొట్టి హుండీలోని సొమ్ము, ఆభరణాలు దోచుకెళ్లారు.
- శ్రీకంఠపురంలో శివాలయంలో ఏడాదిలో మూడుసార్లు దొంగలు పడ్డారు. ఈ ఆలయం సమీపంలో నివాసాలు న్నాయి.
- రెండు రోజుల క్రితం శ్రీకంఠపురం పులమతి రోడ్డులో ఇళ్లమధ్యలో ఉన్న గంగమ్మ ఆలయంలో తలుపులు పగలకొట్టి హుండీని ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు.
- మూడునెలల క్రితం పరిగి మండలంలోని అమ్మవారి ఆలయంలో చోరీకి పాల్పడ్డారు.



స్టార్టర్ పెట్టె వైరును కట్ చేసిన దృశ్యం

ఒకే రాత్రి పది బోర్ల వద్ద

- ధర్మవరం మండలంలోని బిల్వంపల్లిలో రైతుల పొలాలే లక్ష్యంగా ఈనెల 17న అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఏకంగా 10మంది రైతుల బోర్లకు సంబంధించి కేబుల్ వైరు చోరీ చేశారు. పంచాయతీ బోరుకు సంబంధించిన కేబుల్‌వైరును కూడా ఎత్తుకెళ్లారు. నేలకోట, బుడ్డారెడ్డిపల్లి, ఏలుకుంట్ల, తనకంటివారిపల్లి గ్రామాల్లో కూడా ఆరోజు అర్ధరాత్రి రహదారులకు ఉన్న రైతుల బోర్లకు సంబంధించి కేబుల్‌వైరు చోరీ చేసినట్లు ఆయా గ్రామాల రైతులు గగ్గోలు పెడుతున్నారు. పక్కాప్లాన్‌తోనే దొంగలు వాహనాల్లో వచ్చి చోరీ చేసినట్లు రైతులు చెబుతున్నారు. వేసవి సమీపిస్తున్న వేళ పంటలకు నీరు పెట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు.
- ఏలుకుంట్ల గ్రామంలో గతవారం రైతు సత్యప్ప కొత్తగా బోరువేసి స్టార్టర్‌పెట్టె అమర్చాడు. రెండురోజులకే రైతు పొలంలో ఉన్న స్టార్టర్ పెట్టె చోరీకి గురైంది. బోరుబిగించిన రెండురోజులకే స్టార్టర్‌పెట్టే చోరీకి గురికావడంతో పంటలు ఎలా పండించుకునేది అని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

రాత్రిపూట గస్తీ ఏదీ..?

ఐదేళ్ల క్రితం వరకు పోలీసులు రాత్రిపూట గస్తీ నిర్వహించేవారు. అప్పట్లో కొన్ని ఆలయాలు సిబ్బందికి అప్పగించారు. ఆ ఆలయాల్లో ఏం జరిగినా ఆ సిబ్బందిదే బాధ్యత. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆలయాల భద్రతను గాలికి వదిలేశారు. చోరీలు జరుగుతున్నా పట్టించుకోలేదు. ప్రభుత్వం మారినా అది అలాగే కొనసాగుతోంది. దీంతో రాత్రిపూట పల్లెల్లో సైతం గస్తీ పూర్తిగా తగ్గింది. సిబ్బంది కొరత వల్లే రాత్రిపూట గస్తీ తగ్గినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దాని మానిటరింగ్ పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేస్తే కొంతవరకైనా ఫలితం ఉంటుందని తెలుస్తోంది.

చోరీలపై నిఘా

ధర్మవరం మండలంలో రైతుల పొలాల్లో కేబుల్‌వైర్ల చోరీ, ఆలయాల్లో అమ్మవార్ల ఆభరణాల చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టాం. వీటిపై దర్యాప్తు చేస్తున్నాం. తప్పనిసరిగా చోరీలకు పాల్పడేవారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. చోరీలను అరికట్టేందుకు గ్రామాల్లో రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం.

- శ్రీనివాసులు, ఎస్ఐ, ధర్మవరం రూరల్

బ్యాంకులు విరివిగా రుణాలివ్వాలి: కలెక్టర్



పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు, చేనేత కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో అర్హులైన వారికి బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ సమావేశ భవనంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతిపై బ్యాంకర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్నిశాఖల అధికారులతో బ్యాంకర్లు సమన్వయం చేసుకుని, అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో స్థిరమైన వృద్ధిరేటు సాధించడానికి ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. రుణాల మంజూరుకు లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో సమీక్షలు నిర్వహించాలన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన శిక్షణ పూర్తి చేసిన లబ్ధిదారులు జిల్లాలో 2000 మంది ఉన్నారనీ, వారికి అర్హత మేరకు రుణాలు అందించడానికి లీడ్ బ్యాంకు అధికారులు జాబితా సిద్ధంచేయాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే మంగళవారంలోపు నివేదికలు అందించాలన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంకు ప్రతినిధి గంగాధర్, పట్టుపరిశ్రమ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఎల్ఎండీ రమణకుమార్, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, గిరిజన సంక్షేమశాఖ మోహన్‌రావు, సాంఘిక సంక్షేమశాఖ శివరంగప్రసాద్ పాల్గొన్నారు.

రీసర్వే పక్కాగా చేపట్టాలి

రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే పక్కాగా చేపట్టాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశించారు. మండలంలోని జగరాజుపల్లి వద్ద గురువారం భూముల సర్వేను ఆయన పరిశీలించారు. కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు పలు సూచనలు ఇచ్చారు. రీసర్వేలో తప్పిదాలకు తావివ్వొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, సర్వేయర్ విజయశాంతిబాయి ఉన్నారు.



జగరాజుపల్లి వద్ద రీసర్వేని పరిశీలిస్తున్న సిసోడియా, కలెక్టర్

చూడాలంటే భయపడాలి..!


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎస్పీ రత్న, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తదితరులు


నారీ శక్తిని తెలిపే నృత్య ప్రదర్శన

బాలికల జోలికొస్తే ఎన్‌కౌంటర్ చేయండి
పోలీసులకు ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి
'ఆద్య' పేరిట పోలీసు శాఖ వినూత్న కార్యక్రమం
తొలిసారిగా నసనకోట ఎంజేపీ పాఠశాలలో నిర్వహణ



రామగిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బాలికల వైపు కన్నెత్తి చూడాలంటే కీచకులు భయపడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. సమాజంలో జరిగే పరిణామాలను తెలియజేసి.. బాలికలను చైతన్యపరిచేందుకు శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు 'ఆద్య' పేరిట తొలిసారి నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. నసనకోటలోని ఎంజేపీ బాలికల పాఠశాలలో ఎస్పీ సుధాకర్ యాదవ్ అధ్యక్షతన గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలను వేధించేవారిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేయాలని ఎమ్మెల్యే అన్నారు. చిన్న వయసులో ప్రేమ, ఇతర వాటికి ఆకర్షితులు కావద్దని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అనుక్షణం పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యాభివృద్ధి కోసం తాను, తన భర్త పరిటాల రవీంద్ర ఎంతో కృషిచేశామని అన్నారు. బాలికల విద్యాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. 'ఆద్య అంటే పవర్, సాటిలేని వ్యక్తి' అని అన్నారు. మహిళలు, బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు. భర్తను కోల్పోయి, కష్టకాలంలో రాజకీయాల్లోకి వచ్చానని, శవాలను దాటుకుని నామినేషన్ వేసిన రోజులు ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. ఆ తరువాత రాజకీయాల్లో రాణిస్తున్నానని అన్నారు. తనలాగే ప్రతి మహిళ ధైర్యంగా అడుగులు వేయాలని అన్నారు. తల్లిదండ్రుల సహకారంతో రాణించిన అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఎస్పీ రత్నను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఎంతో మంది రైతులు పంటలు సరిగా పండకపోయినా, తిన్నాతినకపోయినా బిడ్డల చదువుకోసం డబ్బులు ఖర్చు చేస్తున్నారని, వారి ఆశలను వమ్ము చేయవద్దని సూచించారు.

అరచేతిలో అద్భుతం: ఎస్పీ రత్న



సెల్‌ఫోన్ అరచేతిలో అద్భుతమని.. అది శాపంగా మారకుండా చూసుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. టెక్నాలజీని మంచి కోసం ఉపయోగించాలని అన్నారు. బాలికల రక్షణ కోసం పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని, సైబర్ క్రైం, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైన తప్పుడోవ పట్టించాలని చూస్తే ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఫిర్యాదు చేయాల్సిన నంబర్లను బాలికల చేత చెప్పించారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే వారికి లోకంలో ఏది చూసినా అందంగా కనిపిస్తుందని, ఆ సమయంలోనే ఏది మంచి ఏది చెడు అన్నది తెలుసుకోవాలని హితవు పలికారు. 'మీ జీవితాన్ని.. మీ శరీరాన్ని పరాయి వ్యక్తుల పాలు చేయవద్దు. సోషియల్ మీడియాలోకి ప్రవేశించి మీ జీవితాన్ని పక్కదారి పట్టించుకోవద్దు' అని సూచించారు.

నమ్మకాన్ని వమ్ము చేయొద్దు
- అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న



తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో అమ్మాయిలను చదివిస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాగా చదువుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. ఒక్కరు తప్పు చేసినా ఆ ప్రభావం మొత్తం పాఠశాల, గ్రామం మీద పడుతుందని హెచ్చరించారు. 'మా ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలం ఉన్నాం. త్వరగా పెళ్లి చేయాలని మా తల్లిదండ్రులపై ఒత్తిడి ఉండేది. కానీ వారు నాపై నమ్మకంతో సివిల్స్ కోసం ఢిల్లీకి పంపించారు. నేను నాలుగుసార్లు వరుసగా విఫలమయ్యాను. నాపై నాకు నమ్మకంలేని సమయంలో నా తల్లిదండ్రులు వెన్నుతట్టి ప్రోత్సహించారు. చివరికి ఐదవ సారి సివిల్స్‌లో ర్యాంకు సాధించాను. ఐపీఎస్‌గా మీ ముందుకు వచ్చాను' అని వివరించారు. పాఠశాల బాత్‌రూంలోలలో బాలికలు ప్రసవిస్తున్నారు. ఈ సంఘటనలు నన్ను కలచి వేస్తున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆడబిడ్డలకు రక్షణ: శైలజ, న్యాయవాది

ఇటీవల బాలికలు, మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు ఎక్కువయ్యాయని ప్రముఖ న్యాయవాది పరిటాల శైలజ అన్నారు. వీటి నియంత్రణకు ఓ వైపు పోలీసుశాఖ పని చేస్తోందని, అదే సమయంలో న్యాయపరంగా తాము అందుబాటులో ఉంటామని అన్నారు. పాఠశాలస్థాయి నుంచి అనేక అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆద్యలాంటి కార్యక్రమాలు బాలికల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయని అభినందించారు. ఆద్య కార్యక్రమంలో బాలికల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం, ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, టీడీపీ నాయకులు ఎల్.నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు సర్పంచ్ లలితమ్మ, ఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

ఓం నమఃశివాయ

ఏడోరోజూ కొనసాగిన యజ్ఞం... శివుడికి అభిషేకాలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శివనామస్మరణతో ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ హాల్ మార్మోగింది. విశ్వశాంతి, లోకసంరక్షణ కోసం చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞం ఏడోరోజు గురువారం కూడా కొనసాగింది. సాయికుల్వంత్‌లో వందల మంది పండితులు, యజ్ఞాన్ని కొనసాగించారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు యజ్ఞం కొనసాగింది. శివలింగానికి వేదపండితులు పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. గణపతి పూజతో యజ్ఞాన్ని మొదలుపెట్టి సర్వదేవతా అర్చనతో కొనసాగించారు. అతిరుద్ర మహాయజ్ఞాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. సాయంత్రం సాయికుల్వంత్‌లో నవీన్, ప్రతీక్ బృందం సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రిజర్వేషన్ ఉద్యోగులపై మంత్రి లోకేశ్‌కు మక్కువ

● ఆర్ఈఎఫ్ నాయకులు ● వీసీకి గజమాలతో సత్కారం


వీసీ సుదర్శనరావును గజమాలతో సత్కరిస్తున్న ఆర్ఈఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలోని రిజర్వేషన్ వర్గాల ఉద్యోగులంటే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు మక్కువ అని ఆర్ఈఎఫ్ నాయకులు అన్నారు. జేఎన్‌టీయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సుదర్శనరావును గురువారం వారు గజమాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రిజర్వేషన్ వర్గాలపట్ల అమానవీయంగా వ్యవహరించారన్నారు. నామినేటెడ్, కీలక పదవులకు అర్హత, అనుభవమున్నా నియమించలేదన్నారు. విశ్వవిద్యాలయాల్లో రాజకీయాన్ని చొప్పించి వైసీపీ వారికే పదవులు కట్టబెట్టేవారన్నారు. కూటమి ప్రభుత్వంలో రిజర్వేషన్ వర్గాల ఉద్యోగులకు సముచిత స్థానం కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. ప్రొఫెసర్ సుదర్శనరావును వీసీగా నియమించడం ఇందుకు నిదర్శమన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రామచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంబీ నాగభూషణం, నాయకులు రామకృష్ణ, రాజ్‌కుమార్, వెంకటనారాయణ, కుళ్లాయప్ప, ఉమాశంకర్ తదితరులు వీసీని కలిసిన వారిలో ఉన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న అర్చకుడు రామాంజనేయులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో పెద్దకదిరప్ప స్వామి రథోత్సవం సందర్భంగా గురువారం రాతిదూలం లాగుడు పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో 9జతల వృషభాలు పాల్గొన్నాయి. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లికి చెందిన ఇంద్రారెడ్డి వృషభాలు 5,439అడుగులు లాగి మొదటి బహుమతి కింద రూ. 40వేలు సాధించాయి. తాడిపత్రికి చెందిన శేఖర్‌రెడ్డి వృషభాలు 5,400అడుగులు లాగి రెండో బహుమతి కింద రూ.30వేలు, పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లికి చెందిన శివారెడ్డి వృషభాలు 4,882 అడుగులు లాగి మూడో బహుమతి కింద రూ.20వేలు, నంద్యాల జిల్లా ప్యాపిలి రంగాపురంకు చెందిన రామకృష్ణారెడ్డికి చెందిన వృషభాలు 4,846 అడుగులు లాగి నాలుగో బహుమతి కింద రూ.15వేలు సాధించాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రామాంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి భూకబ్జా

భారీ బందోబస్తు మధ్య హక్కుదారులకు స్వాధీనం
శెట్టిపల్లిలో హైటెన్షన్
రెవెన్యూ అధికారులతో కబ్జాదారుల వాగ్వాదం


పత్రాలు చూపుతున్న కరణం వెంకోబరావు మనవళ్లు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో శోత్రియం భూమిని నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి భూకబ్జా బాగోతం బట్టబయలైంది. గురువారం శెట్టిపల్లి మారెమ్మదిన్నె సమీపంలో శోత్రియం 28సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు భారీ పోలీస్ బందోబస్తు మధ్య సర్వే చేయడంతో కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల వాగ్వాదానికి దిగారు. సర్వేచేసి వెంకోబరావు మనవళ్లకు భూమిని స్వాధీనం చేశారు. వివరాల్లోకెళితే.. శెట్టిపల్లి పంచాయతీలోని మారెమ్మదిన్నె సమీపంలో సర్వే నంబరు 28-2లో 28 సెంట్ల భూమికి వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి అడ్డుపడుతున్నాడు. శోత్రియం భూమిని 2000 సంవత్సరంలో కరణం వెంకోబరావు కుమార్తె సరోజమ్మకు పసుపుకుంకుమ కిందరాసిచ్చారు. వెంకోబరావు కుటుంబ సభ్యులు ఎవరూ గ్రామంలో లేకపోవడంతో వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి భూమిపై కన్నేశాడు. భూమిని కబ్జాచేసి 2022 సంవత్సరంలో కృష్ణారెడ్డి తన భార్య అర్చన పేరుతో ఫేక్‌డాక్యుమెంట్లు సృష్టించి బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న వెంకోబరావు కుటుంబ సభ్యులు చలపతిరావు, రాఘవేంద్రరావు, అరుణ్‌కుమార్ ఇటీవల శెట్టిపల్లిలో తమభూమిని కబ్జాచేశారని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శెట్టిపల్లిలో రెండ్రోజుల క్రితం సర్వేచేపట్టారు. వెంకోబరావు పేరుతోనే 28 సెంట్ల డైక్లాట్‌లో ఉందని రెవెన్యూ అధికారులు తేల్చారు. గురువారం రెవెన్యూ అధికారులతో కలిసి వెంకోబరావు కుటుంబ సభ్యులు భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎక్స్‌కవేటర్ సాయంతో భూమి చదును పనులు చేస్తుండగా కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు భూమి తమదేనంటూ వాగ్వాదానికి దిగారు. దాదాపు గంటపాటు ఆందోళన జరగడంతో శెట్టిపల్లిలో హైటెన్షన్ నెలకొంది. తహసీల్దార్ శ్రీధర్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో మీ వద్ద ఉన్న పత్రాలు తీసుకురమ్మని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత సమస్య సద్దుమణిగింది. కృష్ణారెడ్డి కబ్జా చేసిన స్థలాన్ని సర్వేచేసి ఐదుసెంట్ల భూమిలో అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కరణం వెంకోబరావు మనువళ్లు మాట్లాడుతూ.. శెట్టిపల్లిలో తమ తాత పేరుతో గతంలో వంద ఎకరాలకుపైగా ఉండేదన్నారు. తమ తల్లి సరోజమ్మ పేరుతో తాత 28 సెంట్ల భూమిని పసుపుకుంకుమ కింద రాసిచ్చారని అన్నారు. తాము గ్రామంలో లేకపోయేసరికి కృష్ణారెడ్డి అనే వ్యక్తి భూమిని కబ్జాచేశాడని అన్నారు. అధికారులకు విన్నవించడంతో భూమిని ఇప్పించారని అన్నారు. దీంతో 5సెంట్ల స్థలాన్ని అంగన్‌వాడీ భవనానికి రాసిచ్చినట్లు తెలిపారు.

ఫ్రూట్ కేర్‌తో నాణ్యమైన మామిడి

50 శాతం సబ్సిడీతో పంపిణీ: ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఫ్రూట్‌కేర్‌తో నాణ్యమైన మామిడి పంట వస్తుందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో మామిడిలో ఫ్రూట్ కేర్‌పై ఎఫ్‌పీఓలు, ఎన్జీఓలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది జిల్లాలో 1000 హెక్టార్లలకు అవసరమైన మామిడి రక్షణ కవచం (ఫ్రూట్ కేర్) పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. 50 శాతం సబ్సిడీతో మామిడి రక్షణ కవచం (ఫ్రూట్ కేర్ కవర్) పంపిణీ చేస్తామని తెలిపారు. ఒక్కో రైతుకు హెక్టారుకు 20వేల రక్షణ కవచం కవర్లు ఇస్తామన్నారు. ఒక్కో కవర్ పూర్తి ధర రూ.2 కాగా సబ్సిడీతో రూ.1కి పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ హెచ్ఓ పల్లవి పాల్గొన్నారు.


చెరువులకు నీరివ్వండి

జలవనరుల శాఖ మంత్రికి పల్లె వినతి


మంత్రికి ప్రతిపాదనలు అందిస్తున్న పల్లె

పుట్టపర్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా నియోజకవర్గంలో 193 చెరువులకు సాగునీరిచ్చే ప్రాజెక్టు పనులను వేగం పెంచి ప్రతి చెరువును నీటితో నింపాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. గురువారం అమరావతిలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి పుట్టపర్తి నియోజకవర్గానికి 193 చెరువుల సాగు నీటి ప్రాజెక్టు పనులతోపాటు రిజర్వాయర్లు, కొత్త చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టి భూగర్భ జలమట్టం పెంచాలని విన్నవించారు. సాగునీటి ప్రాజెక్టులు లేక నియోజకవర్గంలో పలు మండలాల్లో భూగర్భజల మట్టం అడుగంటిపోయిందన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా నింపుతున్న చెరువు కరకట్టల పటిష్ఠంతోపాటు ముళ్ల పొదలను తొలగించాలని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలను మంత్రికి నివేదించారు. స్పందించిన మంత్రి నిమ్మల రామానాయుడు పనుల్లో వేగం పెంచి కొత్త చెక్‌డ్యాంలతోపాటు చెరువుల మరమతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పల్లె రఘునాథ్‌రెడ్డి వెల్లడించారు.

సబ్సిడీ రుణాలపై సందిగ్ధం..!



బీసీ కార్పొరేషన్‌లో కొనసాగుతున్న ప్రక్రియ

ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ల రుణాలపై కొరవడిన స్పష్టత

యూనిట్ వివరాలు కూడా ఖరారు చేయని దుస్థితి
పదే.. పదే.. మార్పులతో గందరగోళం
విస్మయం వ్యక్తం చేస్తున్న ఔత్సాహికులు


ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ కార్యాలయాల సముదాయం (పెన్నార్ భవన్)

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాలపై సందిగ్ధం నెలకొంది. నేటికీ యూనిట్ల సంఖ్య, విలువను ప్రకటించడంతో దీంతో దరఖాస్తు కూడా చేసుకోలేని దుస్థితి. ఆన్‌లైన్‌లో వివరాలే లేవు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగ యువత, వ్యాపారుల స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలను అందజేస్తోంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ఔత్సాహికులు పోటీ పడుతున్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లు సబ్సిడీ రుణాలకు మంగళం పలికారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలివ్వాలని నిర్ణయించడంతో దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ఇప్పటికే బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ యూనిట్‌గా నిర్ణయించి, దరఖాస్తులు ఆహ్వానించింది. ఔత్సాహికులు వేల సంఖ్యలో ధరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికే ఎంపీడీఓ కార్యాలయాల్లో బ్యాంకర్లు, అధికారులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, క్రిస్టియన్లకు సంబంధించి సబ్సిడీ రుణాలపై మాత్రం నేటికీ స్పష్టత లేదు. దీంతో ఆయావర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇదే విషయమై ఆయా కార్పొరేషన్ల అధికారులను ఆరాతీస్తే... రాష్ట్రస్థాయి నుంచి రుణాలకు సంబంధించి యూనిట్లను కేటాయించారే తప్ప.. వాటికి అనుమతులు రావాల్సి ఉందని చెబుతున్నారు. దీంతో రుణాలపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ యువత, ఔత్సాహికులు సందిగ్ధంలో పడ్డారు.

కొనసాగుతున్న ప్రక్రియ

బీసీ కార్పొరేషన్ పరిధిలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టం కింద స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల వరకూ యూనిట్లను నిర్ణయించారు. ఈ ఏడాదికి యూనిట్లను కేటాయించారు. జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేసుకునే నిరుద్యోగ యువత కోసం రూ.8 లక్షలు రుణం అందించనున్నారు. నెల రోజులుగా బీసీ కార్పొరేషన్ పరిధిలో రుణాల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. వేలమంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారుల ద్వారా అందిన సమాచారం. కొన్ని మండలాల్లో బ్యాంకర్లు, ఎంపీడీఓల ఆధ్వర్యంలో ధరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు సైతం నిర్వహిస్తున్నారు.

అనంత జిల్లాకు యూనిట్ల కేటాయింపు ఇలా..

కార్పొరేషన్	కేటాయించిన యూనిట్లు	నిధులు విడుదల
బీసీ	1,728	రూ.32.90కోట్లు
ఈబీసీ	102	రూ.1.77కోట్లు
కమ్మ	58	రూ.1.01 కోట్లు
రెడ్డి	29	రూ.50లక్షలు
ఆర్యవైశ్య	21	రూ.36లక్షలు
బ్రాహ్మణ	14	రూ.24లక్షలు
క్షత్రియ	1	రూ.2లక్షలు
జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు..		
బీసీ	35	రూ.2.80కోట్లు
ఈబీసీ	17	రూ.1.36కోట్లు
కమ్మ	9	రూ.72లక్షలు
రెడ్డి	5	రూ.40లక్షలు
ఆర్యవైశ్య		
బ్రాహ్మణ	6	రూ.48లక్షలు

స్పష్టత ఏదీ?

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంబంధించిన సబ్సిడీ రుణాల విషయంలో స్పష్టత కొరవడిందనే చెప్పాలి. రాష్ట్రస్థాయిలో అన్ని కార్పొరేషన్లకు యూనిట్లవారీగా రుణాల మంజూరుకు నివేదికలు తయారు చేసినట్లు సమాచారం. ఆ మేరకు ఇప్పటికే ఆయా కార్పొరేషన్ల ఈడీలకు ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తుల విషయంలో మాత్రం రాష్ట్ర అధికారుల నుంచి స్పష్టత కొరవడినట్లు సమాచారం. ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి అన్ని రకాల పనులు పూర్తయినా రాష్ట్రస్థాయి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియలో స్పష్టత ఇవ్వలేదు. ఎస్టీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాలపై ప్రణాళికలే రూపొందించనట్లు సమాచారం. మైనార్టీ కార్పొరేషన్ పరిధిలో రూ.లక్ష కాకుండా... ఏకంగా రూ.5 లక్షలు, రూ.10 లక్షల యూనిట్లు మంజూరు చేయడంతోపాటు... ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలోనే కేటాయించినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో సైతం రాష్ట్రస్థాయి అధికారులు పునరాలోచనలో పడటంతో రుణాలపై గందరగోళం నెలకొన్నట్లు ఆయా కార్పొరేషన్ల అధికారుల ద్వారా అందిన సమాచారం. దీంతో పలువురు ఔత్సాహికులు.. ఆయా కార్పొరేషన్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



ప్రతిపాదనలు పంపాం

మైనార్టీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాలకు సంబంధించి రాష్ట్రస్థాయి అధికారులు వివరాలు అడిగారు. ఆ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిపాదనలు పంపాం. అక్కడి నుంచి ఆదేశాలు అందితే... అమలు చేస్తాం.

- సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి ఈడీ, మైనార్టీ కార్పొరేషన్

కసరత్తు చేస్తున్నాం

గిరిజన కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు సంబంధించి రాష్ట్రస్థాయి నంచి ఆదేశాలు రావాల్సి ఉంది. రుణాలపై కసరత్తు చేస్తున్నాం. రాష్ట్రస్థాయి అధికారులు త్వరలోనే క్లారిటీ ఇస్తామంటున్నారు. వచ్చిన వెంటనే దరఖాస్తులు ఆహ్వానించి, ప్రక్రియ పూర్తి చేస్తాం.

- రామాంజనేయులు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి



జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు


డైరీని ఆవిష్కరిస్తున్న కాలవ శ్రీనివాసులు, సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో ఏపీయూడబ్ల్యూజే-2025 డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి షేక్ మహ్మద్ అయూఫ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేవీ కుమార్, చలపతి, జిల్లా గౌరవ అధ్యక్షుడు భోగేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను సంఘం నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జర్నలిస్టుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చొరవ చూపుతానని ఆయన హామీ ఇచ్చారు.

బీసీ రమేష్ గౌడ్‌కు అంతర్జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న రమేష్‌గౌడ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు బీసీ రమేష్ గౌడ్ అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు 19వ తేదీన దుబాయ్‌లోని దిపాం జుమేరియాలో నిర్వహించిన ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురు ప్రముఖులను ఎంపిక చేయగా, అందులో జిల్లా నుంచి బీసీ రమేష్‌గౌడ్‌ను ఎంపిక చేసి అవార్డును అందజేశారు.



కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అమ్మకు అండగా..!

కూడేరు పీహెచ్‌సీలో ఇక మెరుగైన వైద్యసేవలు

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ

రక్తహీనతతో బాధపడుతున్న వారిపై దృష్టి

యాప్ ద్వారా పర్యవేక్షణ

మాతాశిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం

కూడేరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా అడుగులు పడుతున్నాయి. 24 గంటల పీహెచ్‌సీ అయినా గర్భిణులు, బాలింతలకు సరైన వైద్యసేవలు అందడంలేదన్నది నిర్వివాదాంశం. మండలంలో అనేకమంది గర్భిణులు రక్తహీనతతోబాధపడుతూ ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర వైద్యశాఖ, స్వస్థి అనే కర్ణాటకకు చెందిన స్వచ్ఛంద సంస్థ పీహెచ్‌సీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని ఆస్పత్రిని మోడల్ పీహెచ్‌సీగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల వైద్యశాఖ డైరెక్టర్ వీరపాండియన్, స్వస్థి ప్రతినిధులు, జిల్లా వైద్యాధికారులు ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో కల్పించాల్సిన వసతులపై ఆరా తీసి, వెళ్లారు.

ప్రత్యేకంగా జనని మిత్ర యాప్



కూడేరు మండలంలో గర్భిణులు, బాలింతలు అధికమంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రస్తుతం మండలంలో 290 మంది గర్భిణులు ఉన్నారు. పదిమంది వరకు 7 శాతం లోపు, 13 మంది 10 శాతంలోపు రక్తం కలిగి ఉన్నట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. వీరందరూ వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ ప్రభావం కడుపులోని శిశువుల ఎదుగుదలపై పడుతోంది. జిల్లాలో అధికమంది రక్తహీనతతో బాధపడుతున్న మండలాల జాబితాలో కూడేరు ఉంది. రక్తహీనత ప్రమాదం నుంచి తప్పించడంపై రాష్ట్ర వైద్యశాఖ దృష్టి సారించింది. ఏఐ సాంకేతికతతో జనని మిత్ర ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఆ యాప్‌ను కూడేరులోనే వైద్యశాఖ డైరెక్టర్ ఇటీవల ఆవిష్కరించారు.



జనని యాప్‌పై గర్భిణీకి అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రక్తహీనత బాధితులకు అవగాహన

రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల సమాచారం మొత్తం జనని మిత్ర యాప్‌లో నమోదుచేసి ఉంటుంది. యాప్ ద్వారా నాలుక, కళ్లు, గోర్లను స్కాన్ చేస్తే వారికి ఎంత రక్తంఉంది, అది పెరగడానికి ఎలాంటి ఆహారం, పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలి, వాతావరణంలో మార్పులు వచ్చినపుడు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి, గర్భిణులు చేయాల్సిన వ్యాయామం తదితర వివరాలు తెలియజేస్తారు. వైద్యం ఎలా పొందాలి, ఏయే మాత్రలు, మందులు తీసుకోవాలో వివరిస్తారు. డాక్టర్ల వద్దకు వెళ్లకుండానే ఉన్నచోటనే ఈ యాప్ ద్వారా గర్భిణులు రోజూ వారి ఫోన్‌లోనే చూసుకుని, తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లను వైద్యశాఖ చేపట్టింది.

సిబ్బంది సమస్య తీరేనా..?

మోడల్ పీహెచ్‌సీగా ఎంపికైన కూడేరు పీహెచ్‌సీలో సమస్యలు తీరుతాయా అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రిలో ఆరు పడకలు మాత్రమే ఉన్నాయి. ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉన్నారు. సీహెచ్‌ఓలు ఇద్దరు ఉండాల్సిన చోట ఒక్కరూ లేరు. పీహెచ్ఎన్ పోస్టు ఖాళీగా ఉంది. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులేదు. ఉన్న సిబ్బందిపై పనిభారం పెరిగి, 24 గంటలు వైద్యసేవలు అందకుండా పోవడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య పథకాలు సకాలంలో అందకుండా పోతున్నాయనే వాదనలున్నాయి. ఇపుడైనా పోస్టులను భర్తీచేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



జనని మిత్ర యాప్‌ను కూడేరులో ఆవిష్కరిస్తున్న వైద్య శాఖ డైరెక్టర్ వీరపాండియన్, కలెక్టర్ (ఫైల్)

మాతాశిశు సంరక్షణకే ప్రాధాన్యం



మండలంలో అనేకమంది గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నారు. ఈ కారణంగా గర్భంలో శిశువు ఆరోగ్యంగా అభివృద్ధి చెందట్లేదు. అలాంటి వారు ప్రసవ సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అలాంటి వారిపై జనని మిత్ర యాప్ ద్వారా ప్రత్యేక దృష్టి పెట్టొచ్చు. తద్వారా మాతాశిశు మరణాలు తగ్గించవచ్చు. ఇప్పటికే యాప్‌పై మండలంలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

-డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్యాధికారి, కూడేరు పీహెచ్‌సీ

హాస్టళ్లపై నిర్లక్ష్యం

సమీపిస్తున్న పదో తరగతి పరీక్షలు

పేద పిల్లల విద్యపట్ల సంక్షేమశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. వివిధ సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించడం, ట్యూటర్లతో క్లాసులు చెప్పించడాన్ని గాలికొదిలేశారు. ఉన్నతాధికారులు సమావేశాలతో సరిపెడుతున్నారు. కనీస పర్యవేక్షణ లేకపోవడంతో చాలాచోట్ల స్టడీ అవర్స్ కూడా నిర్వహించలేదు. ఇలాగైతే ఉత్తమ ఫలితాలు ఎలా సాధ్యమవుతాయో ఉన్నతాధికారులకే తెలియాలి.

కొరవడిన పర్యవేక్షణ

తూతూమంత్రంగా స్టడీ అవర్స్

విద్యార్థుల సంక్షేమం పట్టని ఉన్నతాధికారులు



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గత వైఫల్యాలను గుర్తెరిగి సంక్షేమ వసతిగృహాల్లో పదో తరగతి ఫలితాలను మెరుగుపరుస్తారా..? వంద శాతం వైపుగా సాగి... పదిపై పట్టు సాధిస్తారా..? అంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తుంటే సందేహాలు కలుగుతున్నాయి. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలని, సంక్షేమశాఖల అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని, వార్డెన్లు స్థానికంగా అందుబాటులో ఉంటూ పక్కాగా స్టడీ అవర్స్‌ను నిర్వహించాలని ఉన్నతాధికారులు సమీక్షలతోనే సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. డివిజన్ల వారిగా ప్రేరణ తరగతులు నిర్వహించడం... వార్డెన్లకు ఆదేశాలు జారీ చేయడం తప్ప... క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పరిశీలించలేదని తెలుస్తోంది. పలుచోట్ల స్టడీ అవర్స్ సక్రమంగా నిర్వహించలేదని సమాచారం. కొన్ని చోట్ల ట్యూటర్లే లేకపోవడంతో పదో తరగతి విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రతి ఏడాది వసతిగృహాల్లో పది ఫలితాల ఉత్తీర్ణత పడిపోతూ వస్తోంది. గతంలో కూడా 50శాతంలోపే ఉత్తీర్ణత సాధించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. గత వైఫల్యాలను గుణపాఠాలుగా నేర్చి ఈసారి పది ఫలితాలపై పట్టు సాధిస్తారా..? లేదా ప్రతి ఏడాదిలాగానే చేతులెత్తేస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గరపడుతున్నప్పటికీ... సంక్షేమ వసతిగృహాల్లో ఆ భయం ఎక్కడా కనిపించడం లేదు.

పర్యవేక్షణ ఏదీ..?

పది పరీక్షలు వస్తున్నాయంటే.. సంక్షేమ వసతిగృహాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ ఏదో ఒక హాస్టల్‌ను తనిఖీ చేస్తూ విద్యార్థులు ఏ మేరకు చదువుతున్నారో పర్యవేక్షించాల్సి ఉంటుంది. వార్డెన్లు అందుబాటులో ఉంటున్నా రా...? ట్యూటర్లు ఉన్నారా..? స్టడీ అవర్స్‌కు టీచర్స్ వస్తున్నారా...? తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. వార్డెన్లతో సమావేశం ఏర్పాటు ఉత్తీర్ణత సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కసరత్తులు తదితర అంశాలపై సూచనలు, సలహాలు తెలియజేయాల్సి ఉంటుంది. వార్డెన్లు పరీక్షలు ముగిసేంత వరకూ నిత్యం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి. జిల్లాలోని పలు సంక్షేమ శాఖ వసతిగృహాల్లో ఆ ఛాయలు ఎక్కడా కనిపించలేదు. ఇలాగే కొనసాగితే ఈ ఏడాది కూడా ఫలితాలు దారుణంగా పడిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా ఆయా సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు నిద్రమేల్కొని పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ పక్కాగా నిర్వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

మూడేళ్లుగా 50 శాతంలోపే...



2022-23లో ఏడాదిలో ఉత్తీర్ణత శాతం పేవలంగా ఉంది. అప్పట్లో జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ పరిధిలోని 36 వసతిగృహాల్లోని 589 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 240 మంది ఉత్తీర్ణత సాధించగా... 349 మంది ఫెయిలయ్యారు. ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలోని 35 వసతి గృహాల్లోలో 436 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా... 106 మంది ఉత్తీర్ణత సాధించగా... 330 మంది ఫెయిలయ్యారు. ఎస్టీ సంక్షేమశాఖ పరిధిలో రెండు జిల్లాలోని వసతిగృహాల్లో 86 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా... కేవలం 11 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 75 మంది ఫెయిలయ్యారు. ఆ సంవత్సరం మొత్తంగా 35 శాతమే ఉత్తీర్ణత సాధించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 2024 సంవత్సరంలో 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వందశాతం కలగా మారిపోయేలా ఉందడనంలో ఎలాంటి సందేహం లేదు.

భూ తగాదాతోనే హత్య

యూట్యూబర్‌ను ట్రాక్టర్‌తో ఢీకొట్టి కాలువలో పడేశారు

కేసును ఛేదించిన కసాపురం పోలీసులు

ముగ్గురు నిందితుల అరెస్టు.. ట్రాక్టర్, బైక్ సీజ్

నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు



గుంతకల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): యూట్యూబర్ తిరుమల రెడ్డి(42)ని హత్య చేసినట్లు కసాపురం పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను గురువారం అరెస్టుచేశారు. కసాపురం పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, కేసు వివరాలను రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. బుగ్గసంగాల గ్రామానికి చెందిన వై జీవన్ కుమార్.. తన పరిచయస్థులు బి.రామాంజనేయులు, బి.రామన్న సహకారంతో తిరుమల రెడ్డిని హతమార్చాడని తెలిపారు. బుగ్గసంగాలలో జీవన్‌కుమార్‌కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దాని పక్కనే ఉన్న ఒక ఎకరం ప్రభుత్వ భూమిని కూడా అతను చదను చేసుకున్నాడు. దీనికి తిరుమల రెడ్డి అభ్యంతరం తెలిపాడు. తహసీల్దారుకు ఫిర్యాదు చేశాడు. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించి, ప్రభుత్వ భూమిని ఆక్రమించవద్దని జీవన్ కుమార్‌కు సూచించారు. ఆక్రమణ గురించి కలెక్టరుకు కూడా ఫిర్యాదు చేస్తానని తిరుమల రెడ్డి హెచ్చరించడంతో అతడిపై జీవన్ కుమార్ కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 18వ తేదీ ఉదయం దాదాపు 8 గంటల ప్రాంతంలో తిరుమల రెడ్డి గుంతకల్లులోని తన ఇంటి నుంచి బైక్‌లో బుగ్గసంగాలలోని తన పొలానికి బయలుదేరాడు. సమాచారం తెలుసుకున్న జీవన్ కుమార్ బుగ్గసంగాల శివారులోని హంద్రీనీవా కాలువ వద్ద కాపుకాచి బైక్‌ను ట్రాక్టరుతో ఢీకొట్టి తీవ్రంగా గాయపరిచాడు. సంగాలకు చెందిన రామాంజనేయులు, కసాపురానికి చెందిన రామన్న సహకారంతో అపస్మారక స్థితిలో ఉన్న తిరుమలరెడ్డిని హంద్రీనీవా కాలువలోకి నెట్టేశాడు. మృతుడి కుటుంబ సభ్యులు జీవన్ కుమార్‌పై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. ముగ్గురు నిందితులను అరెస్టుచేసి, వారు ఉపయోగించిన ట్రాక్టరు ఇంజన్, బైక్, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని అన్నారు. కేసును పరిష్కరించిన కసాపురం ఎస్ఐ వెంకట స్వామి, హెచ్‌సీ వెంకటేశ్, కానిస్టేబుళ్లు జాఫర్, కిషోర్ కుమార్, రాఘవేంద్ర, నాగేశ్వరరావ్, అంజి, నూర్ మహమ్మద్‌ను సీఐ అభినందించారు.

ప్రతిష్ఠాత్మకంగా పీ-4 మోడల్ సర్వే

- సీఎస్‌కు వివరించిన కలెక్టర్ వినోద్‌కుమార్
- గ్రూప్-2 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4మోడల్ సర్వేను ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కు కలెక్టర్ వినోద్‌కుమార్ వివరించారు. గురువారం సీఎస్ కలెక్టర్, జేసీ తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ మోడల్‌సర్వే, గ్రూప్-2, ఇంటర్ పరీక్షలు, ఎంఎస్ఎంఈ సర్వేతదితర అంశాలపై సమీక్షిస్తూ పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఆంశాల ప్రగతి, చేపట్టిన చర్యలపై కలెక్టర్ వివరించారు. పీ-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్) మోడల్ సర్వేను ప్రతిష్ఠాత్మకంగా మొదలుపెట్టామని అన్నారు. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఈ సర్వేపై శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. సర్వేలో మండల, నియోజకవర్గ స్థాయి అధికారులను భాగస్వామ్యులను చేశామని తెలిపారు. పరీక్షల నిర్వహణపై తీసుకున్న చర్యలు, ఏర్పాట్ల గురించి వివరించారు.

పగడ్బందీగా నిర్వహించాలి

ఈనెల 23న గ్రూప్-2 పరీక్షలను పగడ్బందీగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్-2 పరీక్షను జాయింట్ కలెక్టర్ పర్యవేక్షిస్తారని అన్నారు. మొత్తం 14 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయని, ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాల నిఘా ఉండాలని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ అన్ని కేంద్రాలను తనిఖీచేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఇంటర్ పరీక్షలకు డీఐఓ ఇన్‌చార్జ్‌గా ఉంటారని అన్నారు. పరీక్షల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయించాలన్నారు. అన్ని కేంద్రాల్లోనూ పూర్తిస్థాయిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, డీఈఓ ప్రసాద్‌బాబు, డీఐఓ వెంకటరమణానాయక్, డీపీఓ నాగరాజునాయుడు, సీపీఓ అశోక్‌కుమార్, సీఈఓ రామచంద్రారెడ్డి, పరిశ్రమశాఖ మేనేజర్ శ్రీధర్, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరి షరీఫ్, ఉపాధి కల్పనాధికారి కళ్యాణి పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఈ నెల 23న జరగనున్న గ్రూప్-2 పరీక్షల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే తెలియజేయడానికి కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. సమాచారం కోసం 18004258804. 08554-213722 నెంబర్లకు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

23న రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

గార్లదిన్నె, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఈనెల 23న రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడుపోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జయరాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమహతి రూ. 50వేలు ముంటిమడుగు కేశవరెడ్డి, రెండో బహుమతి రూ.40వేలు భాస్కర్ ఫర్టిలైజర్ లిమిటెడ్ ఎండీ విజయభాస్కర్, మూడో బహుమతి రూ.30వేలు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, నాల్గవ బహుమతి రూ. 20వేలు టీడీపీ సీనియర్ నాయకుడు గేట్ క్రిష్ణారెడ్డి, ఐదో బహుమతి రూ. 10వేలు కోటంక స్టోర్ డీలర్ కేశవయ్య, 6వ బహుమతి రూ. 5వేలు ఈశ్వరయ్య అందచేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9885146131, 9441267743 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎద్దు పొడిచిన వ్యక్తి మృతి

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎద్దు పొడవడంతో తీవ్రంగా గాయపడిన మండలంలోని గుడిపల్లికి చెందిన బోయ తిప్పయ్య (55) చికిత్స పొందుతూ మరణించాడు. కొన్నిరోజుల క్రితం తిప్పయ్య తన ఇంటి ముందు ఎద్దులకు నీరు పెడుతుండగా ఒక ఎద్దు పొడిచింది. కొమ్ములతో కడుపులోకి పొడిచి, పైకి ఎత్తి కిందికి వేసింది. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే అనంతపురంలోని సవీరా ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేయించుకుని అతడు ఈనెల 15వ తేదీన డిశ్చార్జ్ అయ్యాడు. ఈనెల 19న రక్తపు వాంతులు చేసుకోవడంతో కళ్యాణదుర్గం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎద్దు పొడవడంతో అయిన తీవ్ర రక్తగాయం నుంచి తిప్పయ్య కోలుకోలేక అదేరోజు మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కొత్తచెరువు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడపగానిపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం పడి ఉండటాన్ని గురువారం గమనించిన స్థానికులు హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆ మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదని, రైలు ఢీకొని ఉండటంతో ముఖం గుర్తుపట్టలేని విధంగా ఉందని, దీంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసుకున్నామని ఆ పోలీసులు చెప్పారు. మృతుడికి సుమారు 60 సంవత్సరాలు ఉంటాయని, ఎవరైనా ఆచూకీ తెలిస్తే.. 94907 98793 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇది హత్యా.. లేక ఆత్మహత్యా అనేది పోస్టుమార్టం నివేదికతో తేలాల్సి ఉందన్నారు

ఉపాధ్యాయుడి మృతి



గౌసులాజం (ఫైల్)

కొత్తచెరువు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కొండకింద మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గౌసులాజం (42) అనారోగ్యంతో గురువారం మరణించాడు. బుధవారం చెవి నొప్పిగా ఉందంటూ తన ఇంటి వద్ద కళ్లు తిరిగి పడిపోయాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను గురువారం మరణించాడు. గౌసులాజంకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

లేపాక్షి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం లేపాక్షి పెద్దచెరువు వద్ద వెలుగుచూసింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇదే మండలం కుర్లపల్లికి చెందిన రామాంజనేయులు(32)అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది లేపాక్షి పెద్దచెరువు కట్ట వద్ద చింతచెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుర్లపల్లికి చెందిన సాకమ్మ రెండో కుమారుడిగా గుర్తించారు. ఇతడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వంద టన్నులు దాటిన చీనీకాయలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో చీనీ కాయలు వంద టన్నులు దాటాయి. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి వందలోపు దిగుబడుల వచ్చేవి. గురువారం మార్కెట్‌కు 127టన్నుల కాయలు వచ్చాయి. సంబంధిత అధికారులు ఈనామ్ పద్ధతిలో వేలం నిర్వహించారు. టన్ను గరిష్ఠంగా రూ.22,250, కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

878 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 878 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 724 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.675 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ముస్లింలను మరచిపోం

- రంజాన్ నుంచే తోఫా పంపిణీ
- షాదీ మహల్ నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయిస్తా
- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



మహాసమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కూటమి విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ముస్లింలు తమవంతు కృషి చేశారని, వారిని ప్రభుత్వం ఎన్నటికీ మరవదని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఇండియన్ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని లలితకళా పరిషత్‌లో నిర్వహించిన మహాసమ్మేళనంలో 120 మంది స్వచ్ఛంద సేవకులు, సేవాసంస్థల నిర్వాహకులకు 'అనంత సర్వీస్ ఐకాన్' అవార్డులను అందజేశారు. కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరోనా విపత్కర సమయంలో తమ కుటుంబాలను సైతం పక్కన పెట్టి ఎంతో మంది ముస్లింలు కులమతాలకు అతీతంగా అన్నివర్గాలకు సేవా కార్యక్రమాలు, మృతులకు అంత్యక్రియలు చేశారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ముస్లింలను అణగదొక్కిందని పేర్కొన్నారు. వచ్చే రంజాన్ మాసం నుంచే ముస్లింలకు రంజాన్ తోఫాను అందజేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతపురంలో షాదీ మహల్ నిర్మించేందుకు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.30 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో టౌన్ బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళీధర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సాలార్ బాషా, టీడీపీ నాయకులు ఉమర్ ముక్తియార్, సైఫుద్దీన్, జనబలం బాబా, డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్, జాకీర్, ప్రజాబలం నజీర్, టిప్పు సుల్తాన్, మాధవ్, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, ఆశ్రయ క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్



రూ.10 లక్షల చెక్కును ఈఓకు అందజేస్తున్న దాతలు

అన్నదానానికి రూ.10 లక్షల విరాళం

కదిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి నిత్య అన్నదాన పథకానికి బెంగుళూరు నగరం మార్తహళ్లికి చెందిన ఎం. రమేష్‌రెడ్డి, చంద్రిక కుటుంబ సభ్యులు గురువారం రూ.10 లక్షల విరాళం అందించారు. ఈ విరాళాన్ని నిత్యాన్నదాన పథకానికి విని యోగించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దాతలకు స్వామి, అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు.

సోషల్ మీడియాలో పోస్టులపై ఫిర్యాదు

ధర్మవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో న్యాయవాది ఫక్రుద్దీన్, వైసీపీ నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి, మాసపల్లి సాయికుమార్, చందమూరి నారాయణరెడ్డి, చాంద్‌బాషా, చౌడప్ప పాల్గొన్నారు.

ఆరోపణలపై విచారణ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణిపై గతంలో వచ్చిన ఆరోపణలపై ఏడీ నాగరాజు గురువారం విచారణ చేపట్టారు. విద్యార్థులకు కోడిగుడ్లు సరిగా ఇవ్వడం లేదని, పాఠశాలలో గదులున్నా విద్యార్థులకు చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారని, ఉపాధ్యాయుల హాజరుపట్టికలో దిద్దుబాట్లు ఉంటున్నాయిన ఆరోపణలు వచ్చాయి. దీనిపై క్షుణంగా విచారణ చేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏడీ తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ చెన్నక్రిష్ణ ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మెడికల్ షాపులు, హోటల్స్, దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. గురువారం రాత్రి పలు దుకాణాదారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే.. దొంగలను సులభంగా గుర్తించి.. అరెస్ట్ చేయవచ్చని అన్నారు. సమావేశంలో జమేదార్లు వెంకటేష్, కరుణాకర్‌రెడ్డి, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కందికుంట రాక

నంబులపూలకుంట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించనున్న వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొంటున్నట్లు క్లస్టర్ ఇన్‌చార్జి దండే రవి, వాటర్‌షెడ్ ఛైర్మన్ పాలగిరి బాషా గురువారం ప్రటనలో తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు

ధర్మవరం ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలను 15 మంది బ్యాంకు అధికారులు గురువారం నిర్వహించారు. స్వయం ఉపాధి రుణాల కోసం 1900 మంది దరఖాస్తు చేసుకున్నారని కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. గురువారం నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు 1172 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.

ఆప్‌కాస్ విధానాన్ని కొనసాగించాలి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖలో ఆప్‌కాస్ విధానాన్ని కొనసాగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ మేనేజర్ అలీమ్ వినతిపత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ శాఖలో 45 వేల మంది పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు ఉన్నారని, ప్రభుత్వం ఆప్‌కాస్ విధానాన్ని రద్దు చేసి, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తామని ప్రకటించడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో జనార్ధన్, బాలక్రిష్ణ, తిరుపాల్, సూరి, చెన్నక్రిష్ణ, సిఐటియు జగన్మోహన్, క్రిష్ణానాయక్ పాల్గొన్నారు.

విధులు, బాధ్యతలపై అవగాహన

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఈసీ సభ్యులకు విధులు, బాధ్యతలపై ఎస్ఆర్‌పీ పుట్ట ఈశ్వరమ్మ గురువారం అవగాహన కల్పించారు. మండల సమాఖ్య అవశ్యకత, అజెండా విధానంతో పాటు మాస నివేదికల ఆధారంగా గ్రేడింగ్ ఎలా తయారు చేయాలి.. తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మీ, ఎస్ఆర్‌పీ సరస్వతి, మునియప్ప, సీసీ వేణుగోపాల్, చంద్రారెడ్డి, సిబ్బంది లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

ధర్మవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం చేశారని సీపీఎం, సీఐటీయూ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం కళ్లకు గంతలు కట్టుకుని కళాజ్యోతిసర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, రాయలసీమలోని అన్ని చెరువులకు మరమ్మత్తులు చేపట్టాలని, ప్రతి చెరువును నీటితో నింపాలని డిమాండ్ చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సీపీఎం నాయకులు స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎల్ నరసింహులు, బాబ్‌జాన్, శాంతిబాయి, జగన్మోహన్, ఇసాక్, రామమోహన్, ఫాజిల్, ఆంజనేయులు, హేమావతి, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: జిల్లాకు నిధులు కేటాయించి, విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సుందరయ్య కాలనీలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, ఆంజి, నరసింహులు, కృష్ణ, కాంతమ్మ, రైతు సంఘం రామిరెడ్డి పాల్గొన్నారు.

● తనకల్లు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కేంద్రం బడ్జెట్‌లో చిన్న, సన్న కారు రైతులు, నిరుద్యోగులు, కూలీలకు అన్యాయం జరిగిందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం శివన్న, రమణ, ఎస్వీ రమణ, సీఐటీయూ ఒంటెద్దు వేమన్న, వెంకటేష్, శ్రీనివాసులు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్మవరం: కళ్లకు గంతలతో నాయకుల నిరసన

తాగేవారికి అడ్డా.. పెద్ద మఠం

గంజాయి, మద్యం సేవిస్తున్న ఆకతాయిలు

తాగి గొడవలు చేస్తూ.. రెచ్చిపోతున్న వైనం

ఫిర్యాదు చేసిన స్థానికులపై బూతుపురాణం

పట్టించుకోని పోలీసులు



తాగుబోతులు, ఆకతాయిలకు అడ్డాగా మారిన మఠం

కొత్తచెరువు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నడిబొడ్డులో ఉన్న పెద్దమఠం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పవిత్రమైన ఆ మఠం నేడు ఆకతాయిలకు గంజాయి, మద్యం తాగుబోతులకు నిలయంగా మారింది. ఆ యువకులు ఆ మఠంలో గంజాయి, మద్యం సేవించి గొడవకు దిగుతుండటంతో ఆ చుట్టు పక్కల నివాసముంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. గంజాయి, మద్యం సేవిస్తున్నారని గతంలో పోలీసులకు సమాచారమిస్తే.. ఆ యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని.. వారి నుంచి మామూళ్లు వసూ లు చేసుకొని.. వదిలేస్తున్నారనే విమర్శలున్నా యి. ఆ ఆకతాయిలు మరళా తాగి వీధిలో నిలబడి.. ఫిర్యాదు చేసిన వారిని బండ బూతులు తిడుతున్నారని, మహిళలతో అభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. 'మాపైనే పోలీసులకు చెబుతారా... వాళ్లు మమ్మల్ని ఏమీ చేయలేరు.. వాళ్లకు డబ్బులు పడేస్తే చాలా.. మమ్మల్ని వదిలేస్తారు. ఆ తర్వాత మిమ్మల్ని ఎవరు కాపాడుతారు.. నా...' అంటూ పచ్చి బూతులు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇక తాము పోలీసులకు ఫిర్యాదు చేయడమే మానుకున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నుంచి మహిళలు బయటకు రావడానికే జంకుతున్నారన్నారు. బుధవారం రాత్రి కూడా కొందరు యువకులు బర్త్‌డే పార్టీ అంటూ నడివీధిలోనే మద్యం తాగుతూ.. కేక్‌లు కట్ చేస్తూ.. వీరంగం సృష్టించారని అన్నారు. పోలీసులు వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోక పోవడంతో వారి మరింత రెచ్చిపోతున్నారని, చాలా మంది ఇక్కడ ఇళ్లను ఖాళీ చేసి.. మరో ప్రాంతానికి వెళ్లారని వాపోయారు.

బీమా పేరుతో మోసం



వెంకటేశ్

తాడిమర్రి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రాంతానికి చెందిన వెంకటేశ్ తాడిమర్రి మండలంలోని ట్రాక్టర్ల యజమానులను బీమా పేరుతో దాదాపు రూ.11.50 లక్షలు మోసం చేశాడు. అంతేకాకుండా పలువురి వద్ద రూ. లక్షలు అప్పులు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. తాడిమర్రి మండలంలోని పత్రపల్లి గ్రామ సమీపంలో 22 ఎకరాలలో టెక్స్‌టైల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నానంటూ వెంకటేశ్ ఆ ప్రాంతవాసులను నమ్మించాడు. తనకు చాలా ట్రాక్టర్లు లీజ్‌కు కావాలని, ఒక్కో దానికి నెలకు రూ.40వేలు బాడుగ ఇస్తామని, మొదట ఒక్కో దానికి రూ.12,500 బీమా చెల్లించాలని, అప్పుడే ఏదైనా ప్రమాదం జరిగినా ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని చెప్పాడు. దీంతో తాడిమర్రి మండలంలోని లక్షుంపల్లి, తాడిమర్రి, బత్తలపల్లి మండలంలోని తంబాపురం, బత్తలపల్లి, ధర్మవరం రూరల్‌లోని వెంకటతిమ్మాపురం, దర్శినమల, మాలగుండ్లపల్లి గ్రామాలకు చెందిన మొత్తం 92 మంది బీమా మొత్తాన్ని అతనికి చెల్లించినట్టు సమాచారం. కాగా, తాడిమర్రికి చెందిన ఒక ట్రాక్టర్ యజమాని అనంతపురం జిల్లాలోని ఓ పోలీసు అధికారి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తనకున్న ట్రాక్టర్‌ను బీమా కట్టించుకోకుండా లీజుకు తీసుకునేలా చూడాలని వెంకటేశ్‌కు చెప్పాలని ఆ అధికారిని కోరా డు. అనుమానం వచ్చిన ఆ అధికారి వెంకటేశ్ గురించి ఆరా తీయగా.. అతనిపై పలు చీటింగ్ కేసులు ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే వెంకటేశ్‌కు ఫోన్ చేసి నీ దందాలు ఆపాలంటూ హెచ్చరించడమే కాకుండా స్థానిక పోలీసులకు సమాచారం చేరవేశాడు. విషయం తెలుసుకున్న బాధితులు అతనికి ఫోన్ చేసి.. డబ్బులు వెనక్కు ఇవ్వాలని బుధవారం కోరగా.. అతను ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. వెంకటేష్ అగ్రహారం గ్రామానికి సంజీవరెడ్డి, భరత.. మరికొందరి వద్ద అప్పులు కూడా చేసినట్లు సమాచారం.

● పలు కేసులు: వెంకటేశ్ అమ్మా ట్రావెల్స్ పేరుతో మోసం చేయడంతో పెనుకొండ సమీపంలోని కియా పోలీస్‌స్టేషన్‌లోనూ అతనిపై పలు కేసులు ఉన్నాయి. షోరూం ధర కంటే తక్కువకే కియా కారు ఇప్పిస్తానంటూ ఓ ఎస్ఐ వద్ద రూ.3 లక్షలు తీసుకొని మోసం చేశాడు. మరో అధికారి వద్ద రూ. నాలుగు లక్షలకే కియ కారు ఇప్పిస్తానని మోసం చేశాడు. ప్రస్తుతం ఆ ఎస్ఐ కడప జిల్లాలో, ఆ అధికారి చిత్తూరు జిల్లాలో పని చేస్తున్నారు.



ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

వైసీపీ నాయకుల ఆక్రమణల తొలగింపు

కదిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక రాయచోటి రహదారిలో వైసీపీ నాయకుడు నూరుల్లా రోడ్డును ఆక్రమించి.. నిర్మించిన మెట్లు, షెడ్‌ను మున్సిపల్ అధికారులు గురువారం కూల్చివేశారు. ఈ ఆక్రమణ కింద మున్సిపల్ పైపులైన్ ఉందని, దీంతో ఇంటి యజమాని నూరుల్లాకు నోటీసులు ఇచ్చి.. ఆ ఆక్రమణలు తొలగించామని కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. అలాగే వైసీపీ నేత, మున్సిపల్ వైస్ ఛైర్మన్ అజికుంట రాజశేఖర్‌రెడ్డి మారుతీనగర్‌లో కాలువపై మెట్లు, ర్యాప్ నిర్మించారని, అతనికి కూడా నోటీసులు ఇచ్చి.. ఆ ఆక్రమణలు తొలగించామని చెప్పారు.

ఎల్ఐసీలో నియామకాలు చేపట్టాలి



కదిరి: నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో నియామకాలు చేపట్టాలని ఆ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. బీమా రంగం రూపు రేఖలు మారిపోతున్నాయని, కావున ఉన్నత విద్యావంతులు, సాంకేతిక పరిజ్ఞానమున్న యువతను ఉద్యోగులుగా నియమించాలన్నారు. యూపీఎస్‌ఈ తరహాలో ఏటా ఎల్ఐసీలో నియామకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, గంగాధర్, శివభారతి, నవీన్‌కుమార్, రామక్రిష్ణ, రఘు పాల్గొన్నారు.

● ధర్మవరం : ఎల్ఐసీలో నియామకాలు చేపట్టాలని, ఎల్ఐసీలో 80 శాతానికి పైగా ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలని ఆ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎల్ఐసీ ధర్మవరం శాఖ క్లాస్-3 ఉద్యోగులు గురువారం ఒక గంట వాకౌట్ సమ్మె నిర్వహించారు. ఇందులో ఆ యూనియన్ సెక్రటరీ రవీంద్ర, నాయకులు ఆనందరావు, పీఎంబాషా, రామన్న, నాగరాజు, రామాంజినేయులు పాల్గొన్నారు.

ఉపాధి పనిదినాలు పెంపు

గాండ్లపెంట, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలాన్ని కరువు ప్రాంతంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయని, దీంతో ఉపాధి హామీ పనిదినాలను 100 నుంచి 150 రోజులకు పెంచినట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఏపీఓ మంజునాథ్ గురువారం తెలిపారు. వందరోజులు పూర్తి చేసుకున్న కూలీలు మరో 50 రోజులు ఉపాధి పనులు చేసుకోవచ్చని, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ విజయానంద్ ఆదేశం

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 23న నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను జిల్లాలో పగడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్.. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనురాధతో కలిసి సీఎస్ విజయానంద్ జిల్లా అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో పొరబాట్లకు తావివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షాకేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో 144 నిషేధాజ్ఞలు అమలు చేయాలన్నారు. పరీక్షలు వాయిదా పడతాయంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

డ్రోన్‌తో అడవుల సర్వే



డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్న సిబ్బంది

తనకల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెట్లతండా, రామ్లానాయక్‌తండా, ముండ్లవారిపల్లి గ్రామాల వద్ద ఉన్న అటవీ ప్రాంతాన్ని డ్రోన్ సాయంతో బెంగుళూరుకు చెందిన వెల్‌ల్యాబ్స్ అనే సంస్థ సర్వే చేస్తోంది. జనజాగృతి ఆధ్వర్యంలో 30 సంవత్సరాలుగా రెండున్నర చదరపు కిలోమీటర్ల పరిధిలోని రెవెన్యూ గుట్టలు, వంకలు, వాగులు, వ్యవసాయ భూముల్లోని చెట్లను ప్రజలు సంరక్షిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా పచ్చదనంతో వెల్లువిరుస్తోంది. దీనిపై ఆ సంస్థ సర్వే చేస్తోంది. సర్వేలో ముఖ్యంగా కార్బన్ శాతం ఎంత, పచ్చదనం ఎంత, చెట్లు, గడ్డి రకాలు, జంతువులు, జీవరాసులు, వాటర్ లెవల్, సాయిల్ ఎలా ఉంది.. తదితర వాటిని డ్రోన్ ద్వారా ఫొటోలు తీసి సర్వేలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వెల్‌ల్యాబ్స్ సంస్థ గౌరవ్, క్రైజ్, జనజాగృతి సంస్థ గరుడప్ప, చంద్రమోహన్, శ్రీనాథ్‌రెడ్డి, హరినాయక్ పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

ధర్మవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీచేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సకలరాజా డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నారా లోకేశ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపడుతూ.. మొదటి సంతకం మెగా డీఎస్సీ మీద పెడుతున్నానని చెప్పారని, ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలుగా గడుస్తున్నా ఇంతవరకూ ఆ ఊసే ఎత్తలేదన్నారు. రేపు జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో నిరుద్యోగులకు రూ.10వేలు నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందులో సునీల్, విజయ్,అరుణ్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు ప్రారంభం

బుక్కపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక వాల్మీకి రామాలయంలో వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం డిగ్రీ కళాశాలను పరిశీలించారు. గత టీడీపీ హయాంలో దాదాపు రూ. రెండు కోట్లతో డిగ్రీకళాశాల భవన నిర్మాణానికి ఆమోదం తెలిపారని, తరువాత వైసీపీ ప్రభుత్వం రావడంతో దాని గురించి పట్టించుకోలేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అలాగే అంగన్‌వాడీ, విలేజ్ క్లీనిక్.. భవనాల నిర్మాణాలూ అర్ధాంతరంగా ఆగిపోయాయని, వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రభుత్వం బాలికల పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, సుబ్బారెడ్డి, గంగాధర్, బాలు, సయ్యద్, సుధీర్, క్రిష్ణ, వాల్మీకి సంఘం ఎర్రకేశి ఉన్నారు.

● నల్లమాడ : స్థానిక గిరిజన బాలుర సంక్షేమ పాఠశాలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తనిఖీచేశారు. పాఠశాల, వసతిగృహం లోని సమస్యలపై విద్యార్థులతో ఆరాతీశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వసతిగృహలో డైనింగ్ హాల్ లేదని, మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయులు సతీష్ ఎమ్మెల్యేని కోరారు. ఎమ్మెల్యే వెంట ఉపాధ్యాయులు, టీడీపీ కన్వీనర్ మైలే శివశంకర్, బుట్టి నాగభూషణనాయుడు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



బుక్కపట్నం : వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి

క్రైం న్యూస్..

అడవికి నిప్పు పెట్టిన వ్యక్తి అరెస్ట్

బుక్కపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కొండకమర్ల బీట్‌లో మూడు రోజుల క్రితం అడవికి నిప్పు పెట్టిన ఓడీసీ మండలం కమ్మవారిపల్లికి చెందిన వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు బుక్కపట్నం అటవీ రెయింజ్ అధికారి యామిని సరస్వతి తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అడవులకు నిప్పుపెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇందులో అటవీ సిబ్బంది రాహుల్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు

ధర్మవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి, మురళీరెడ్డి తనను కులం పేరుతో దూషించారని చెన్నేకొత్తపల్లికి చెందిన దాసరి బోడయ్యను స్థానిక టూటౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఇద్దరిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. దాసరి బోడయ్య పట్టణంలోని గూడ్‌షెడ్ కొట్టాలలో 2010లో 18 సెంట్ల స్థలాన్ని రూ.8.28 లక్షలతో చంద్రమోహన్‌రెడ్డి, మురళీరెడ్డిల నుంచి కొనుగోలు చేశారు. వాళ్లు ఇంతవరకు స్థలాన్ని చూపకుండా తిప్పుకుంటున్నా రు. గురువారం తాను వారిద్దరిని నిలదీయంతో.. వారు కులంతో పేరుతో తనను దుర్భాషలాడారని బోడయ్య ఫిర్యాదు చేశాడు.

దిగువపల్లి వాసిపై..

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపల్లికి చెందిన మనోహర్‌నాయుడు తనను కులం పేరుతో దూషించాడని అదే గ్రామంలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు ఓబులేసు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. దీంతో మనోహర్‌నాయుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ నీరంజన్‌రెడ్డి తెలిపారు.

చీటింగ్ కేసు

కదిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూరిబా వీధికి చెందిన సంపంగి భాస్కర్ తన వద్ద డబ్బులు తీసుకొని మోసం చేశాడని నిజాంవలీ కాలనీ వాసి షేక్‌ఫారూక్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. దీంతో సంపంగి భాస్కర్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. షేక్ ఫారూక్ అన్న ఖజావలీ గంజాయి కేసులో అరెస్ట్ అయి రాజమండ్రి జైలులో ఉన్నాడు. అతన్ని విడిపించడానికి జామీన్‌దార్లు, లాయర్‌ను ఏర్పాటు చేస్తానని సంపంగి భాస్కర్ షేక్ షారూక్ నుంచి రూ. 70 వేలు తీసుకున్నారు. రెండు నెలలు అవుతున్నా, లాయర్, జామీన్‌దార్లను ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ డబ్బు తిరిగి ఇవ్వాలని షారూక్ భాస్కర్‌ను డిమాండ్ చేశారు. దీనికి భాస్కర్ డబ్బు ఇచ్చేదిలేదని, ఏమి చేసుకుంటావో చేసుకో అని బెదిరించాడు. దీంతో ఫారూక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భాస్కర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. సంపంగి భాస్కర్ గతంలోనూ కదిరి కోర్టులో దొంగ జామీన్లు పెట్టి.. అరెస్ట్ అయి జైలుకు వెళ్లాడని సీఐ చెప్పారు.

నీళ్ల గొడవ.. ఇరువర్గాలపై..

కదిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లగుట్ట వీధిలో నివాసముంటున్న ఆర్పీపీ పార్టీకి చెందిన సుగుణమ్మ, ఆమె పక్క ఇంటిలో నివాసముండే ఉదయ్ లక్ష్మీ కొళాయి వద్ద నీళ్ల వంతు కోసం ఈనెల 18న గొడపడ్డారు. ఈ విషయమై 19న కదిరి వెలుగు కార్యాలయం సమీపంలో ఎర్రకోట కాలనీలో సుగుణమ్మ వర్గానికి చెందిన నాగన్న, అరుణ్, మరికొందరు, ఉదయ్‌లక్ష్మీ బంధువులు గొడపడి కొట్టుకొని గాయపడ్డారు. కదిరి ప్రభుత్వ ఆసుప్రతిలో చికిత్స చేయించుకొన్న వారు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో.. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

అసత్య ప్రచారంపై..

తనకల్లు, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగదిన్నెపల్లికి చెందిన కాయల జనార్ధన్‌ను సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేశారని కోర్తికోటకు చెందిన మంజునాథ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కాయల జనార్ధన్‌పై బీఎన్ఎస్ 196, 299 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఈనెల 19న కోర్తికోటలో కొత్తగా నిర్మించిన రామాలయం లో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్‌కే మస్తాన్‌వలీ చెప్పులు వేసుకుని రామాలయంలోకి ప్రవేశించాడని జనార్ధన్ ఫేస్‌బుక్‌లో పోస్ట్‌పెట్టాడు.

ద్విచక్రవాహనదారుడిపై...

ధర్మవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గానగర్‌కు చెందిన రెహమాన్‌ను అదే ప్రాంతానికి చెందిన పవన్‌కుమార్ రెండు రోజుల క్రితం బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రెహమాన్ కాలు విరిగింది. దీంతో గురువారం అతని ఫిర్యాదు మేరకు పోలీసులు పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

రస్తా వివాదం.. ఘర్షణ

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామంలో పొలంలో రస్తా విషయమై గురువారం జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వనం వీరశేఖర్ తన పొలం నుంచి వెళ్తున్న శివమ్మను అడ్డుకున్నాడు. తన పొలంలో రస్తాలేదని, ఇలా వెళ్లరాదని వాగ్వాదానికి దిగాడు. దీంతో శివమ్మ కుటుంబసభ్యులు అక్కడికి వచ్చి వనం వీరశేఖర్‌పై దాడి చేశారు. గాయపడిన అతన్ని ఆ గ్రామస్థులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివమ్మ, ఆమె కుటుంబ సభ్యులు ఆదెప్ప, బయన్న, సాయి, చింటులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

అప్పు చెల్లించమన్నందుకు దాడి

ధర్మవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానికంగా నివాసముంటున్న అబ్దుల్లా తనకు ఇవ్వాల్సిన డబ్బులు అడిగినందుకు తనపై దాడి చేశాడని స్థానిక దుర్గానగర్ వాసి సయ్యద్‌బాషా స్థానిక టూటౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యాన్ బోల్తా



బోల్తాపడ్డ ఐషర్ వాహనం

ముదిగుబ్బ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారెడ్డిపల్లి బ్రిడ్జి సమీపంలో టమోటా లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డ అనంతపురం జిల్లా కూడేరుకు చెందిన డ్రైవర్ ఎర్రిస్వామిని స్థానికులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతపురం నుంచి తమిళనాడుకు ఈ వాహనం వెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది.

పట్టపగలే చోరీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యమ్మ బజారులో నివాసముంటున్న పారిశుధ్య కార్మికుడు అంజి ఇంటిలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. మధ్యాహ్నం భోజనం అనంతరం అంజి, అతని భార్య నాగమ్మ పనిమీద బయటకు వెళ్లారు. సాయంత్రం బడి నుంచి ఇంటికి వచ్చిన పిల్లలు.. ఇంటికి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించి.. ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు ఇంటికి వచ్చి చూడగా బీరువాలో దాచి ఉంచిన ఇరువురి జీతం డబ్బులు రూ.10 వేలు చోరీ అయినట్లు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వృథాగా చెత్త కేంద్రాలు

● నిలిచిపోయిన సేంద్రియ ఎరువుల తయారీ
● కనబడని వానపాముల పెంపకం

చిలమత్తూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చెత్తను సేకరించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్న ప్రభుత్వ లక్ష్యం పూర్తిగా నీరుగారిపోతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటుచేసిన చెత్త సంపద కేంద్రాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పంచాయతీలకు ఆదాయం తీసుకురావాలన్న ఉద్దేశంతో మండలంలోని 11 పంచాయతీలలో ఈ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఒక్కో కేంద్రానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా రూ. 7.66 లక్షలను మంజూరు చేశారు. అందులో పనిచేసేందుకు వెయ్యి మంది జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ని ఏర్పాటుచేశారు. గ్రామాల్లో వీధులను శుభ్రం చేసి పొడి చెత్త, తడి చెత్తను వేరువేరుగా కేంద్రాలకు తరలించేందుకు ట్రైసైకిళ్లను కూడా సమకూర్చారు. ఇప్పటికే కొన్ని కేంద్రాలు చెత్త నుంచి వానపాముల ఎరువును ఉత్పత్తి చేస్తున్నాయి. చెత్త సేకరణ జరుగుతోంది కానీ, వాటి నుంచి ఆదాయాన్ని పొందలేకపోతున్నారు. ప్రధానంగా కేంద్రాల వద్ద వాచ్‌మెన్లు, వానపాములకు చెత్త వేయడం, వాటికి నీళ్ల పట్టడం వంటి పనులు చేయకపోవడంతో వానపాములు కూడా నశించిపోయాయి. ఈ కేంద్రాలు అసాంఘిక కార్యక్రమాలను నిలయాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా మంచి ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఈ కేంద్రాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని కొనసాగిస్తే పంచాయతీలకు ఆదాయం రావడమేకాకుండా, గ్రామాల పారిశుధ్యం కూడా మెరుగుపడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.


సోమఘట్టలో నిరుపయోగంగా మారిన చెత్త సంపద కేంద్రం

మండలంలో కోడూరు పంచాయతీలో మాత్రమే చెత్త సంపద కేంద్రం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. సర్పంచ్ మురళిమోహన్ వానపాముల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టి వర్మీకంపోస్టు ఎరువును తయారుచేయిస్తున్నారు. పారిశుధ్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి కంపోస్టు ఎరువును తయారుచేసి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే 500 కిలోల వరకు వర్మీకంపోస్టు తయారుచేయించి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. అయితే ఇక్కడ జరుగుతున్న విధంగా మిగిలిన చోట్ల జరగాల్సి ఉండగా, ఆయా పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు పట్టించుకోకపోవడంవలన ఆయా కేంద్రాలు నిర్వీర్యంగా మారుతున్నాయి.

అన్నికేంద్రాల్లో వర్మీకంపోస్టు ఉత్పత్తి: ప్రభుదాస్, ఇన్‌చార్జి ఈఓఆర్డీ

గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి ఖచ్చితంగా కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకుంటున్నాము. కొన్నాళ్లుగా ఆశించిన స్థాయిలో చెత్త సేకరణ జరగలేదు. దాంతో పాటు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం జరుగుతోంది. ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాలతో అన్ని కేంద్రాలను మరలా ఉపయోగంలోకి తీసుకువస్తున్నాం. గ్రామ సర్పంచులకు కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టేలా ఆదేశాలు ఇచ్చాం. త్వరలో అన్ని కేంద్రాలలో వర్మీకంపోస్టు తయారీని పెంచి ఆదాయాన్ని పెంచుతాం.

పరిశుభ్రతతోపాటు ఆదాయం పొందుతున్నాం

చెత్తతో సంపద కేంద్రాల వలన పంచాయతీకి ఆదాయంతోపాటు గ్రామాల్లో పరిశుభ్రత నెలకుంటుంది. గ్రామాల్లో దొరికిని చెత్తను సేకరించి కేంద్రాలకు తరలిస్తున్నాం. అక్కడ వానపాములను పెంచుతూ వర్మీకంపోస్టుని తయారుచేస్తున్నాం. తద్వారా పంచాయతీకి ఇప్పుడిప్పుడే ఆదాయం వస్తోంది.


మురళీమోహన్, సర్పంచ్, కోడూరు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్

పెనుకొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద అందుకు సంబంధించి దరఖాస్తు ఫారాలను పూర్తిచేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వేమయ్య పేదలకు ఇంటి స్థలాల కోసం దరఖాస్తు ఫారాలను పూర్తిచేసి వారికి అందజేశారు. ఈ దరఖాస్తు ఫారాలను మార్చి 3న కలెక్టర్ కార్యాలయంలో ఇవ్వడానికి అందరూ పుట్టపర్తికి తరలి రావాలని కోరారు. పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామన్న హామీని నెరవేర్చాలన్నారు. ఇప్పటికే తహసీల్దార్, కలెక్టరేట్ కార్యాలయాల్లో వినతిపత్రాలు మాత్రమే ఇస్తున్నామని వాటిని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, చాంద్‌బాష, నరసింహులు, వెంకటేశులు, కిష్టప్ప, మల్లికార్జున, బాలస్వామి, లింగారెడ్డి, రామక్రిష్ణ, రామాంజినప్ప పాల్గొన్నారు.


ఇంటిపట్టాల దరఖాస్తులను పూర్తిచేస్తున్న సీపీఐ రామక్రిష్ణ

పెద్దలకు వరాలు.. పేదలకు భారాలు

● కార్పొరేట్లకు అనుకూలించేలా కేంద్ర బడ్జెట్
● వాడవాడలా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కొంత మంది కార్పొరేట్లకు అనుకూలించే విధంగా ఉందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం పట్టణ పరిధిలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. భారతదేశం 65 శాతం వ్యవసాయ ఆధారిత దేశమని ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతులకు మొండి చేయి చూపారన్నారు. రైతులకు రూ. 5 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ. 1.27 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. దేశంలో ముఖ్యమైన వైద్య రంగానికి కూడా అన్యాయం జరిగిందన్నారు. అలాగే విద్యకు 6 శాతం అంటే రూ.5 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ. 1.20 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. బ్యాంకులకు రుణాలను ఎగ్గొట్టిన కార్పొరేట్లకు మాత్రం రూ.14.47 వేల కోట్లు అప్పులు మాఫీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాయక్షుడు బాబావలి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సోమందేపల్లి: కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేవిధంగా ఉందని పేదలకు మేలుచేసేలా లేదని సీపీఎం మండల కార్యదర్శి రంగప్ప, కేవీపీఎస్ జిల్లా నాయకులు హనుమయ్యలు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద అనుబంధ సంఘాల నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.


పెనుకొండ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజావ్యతిరేక ప్రతిపాదనలను తిరస్కరించాలని సీపీఎం పార్టీ పిలుపునిచ్చింది. పెనుకొండ అంబేడ్కర్ సర్కిల్‌వద్ద గురువారం సీపీఎం నాయకులు ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు హరి, గంగాధర్, బాబావలి, చిన్నవెంకటేశులు, వెంకటరాముడు మాట్లాడుతూ ప్రజల్లో కొనుగోలుశక్తి కుంచించుకు పోయిందన్నారు.

కార్మిక సంఘాల రాస్తారోకో

గోరంట్ల: పట్టణంలోని హిందూపురం ప్రధాన రహదారిపై కార్మిక సంఘాల నాయకులు గురువారం కేంద్రం బడ్జెట్ కేటాయింపులకు నిరసనగా రాస్తారోకో చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం వారు ఎర్రజెండాలు పట్టుకుని ఆందోళన చేశారు. కార్మిక సంఘం నాయకులు కొండా వెంకటేష్, పెద్దన్న, స్వర్ణలత మాట్లాడుతూ వెనుకబడిన సత్యసాయి జిల్లాలో వలసల కారణంగా రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నారు.

జ్ఞానజ్యోతితో చిన్నారుల సమగ్రాభివృద్ధి

చిలమత్తూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్రాభివృద్ధి కోసమే జ్ఞానజ్యోతి శిక్షణాకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ శాంతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని టేకులోడు గురుకుల పాఠశాల, మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం జరిగిన జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పే విధానంలో మెలకువలను ఈ శిక్షణ ద్వారా అందివ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా పిల్లల్లో అభ్యాసనా నైపుణ్యాలను పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.


జ్ఞానజ్యోతిపై అంగన్ వాడీలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

అగళి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అగళి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతిపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. చిన్న పిల్లలను ఎలా చదివించాలి, ఆటల పోటీలు ఎలా నేర్పించాలి తదితర వాటిపై ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 25వరకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సూపర్‌వైజర్ లీలావతి పాల్గొన్నారు.

మద్యం కేసులో విచారణ

హిందూపురం, ఫిబ్రవరి, 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హిందూపురంలో వెలుగుచూసిన నకిలీ మద్యం కేసుకు సంబంధించి ముగ్గురిని ఎక్సైజ్ అధికారులు కస్టడిలోకి తీసుకొని విచారించారు. ఈ కేసులో కొంత మందిని అరెస్టు చేయగా వారు బెయిల్‌పై బయటికి వచ్చారు. ఇటీవల మరి కొంత మందిని అరెస్ట్ చేశారు. వారిలో ముగ్గురిని కోర్టు ద్వారా కస్టడికి తీసుకొని గురువారం విచారించినట్లు విశ్వసనీయ సమాచారం.

వైసీపీ నుంచి టీడీపీలోకి...


మహేష్‌ను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

అమరాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల పరిధిలోని చిట్నడుకు గ్రామానికి చెందిన వార్డు మెంబర్ మహేష్ వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. మండల కన్వీనర్ గణేష్ ఆయనకు పసుపు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మడకశిర నియోజకవర్గంలో వైసీపీకి సరైన నాయకత్వం లేదని, గత ఐదు సంవత్సరాలలో నమ్ముకొన్న ప్రజలకు న్యాయం చేయలేకపోయామని, అందువలన తన సభ్యత్వానికి రాజీనామా చేసి టీడీపీ పార్టీలో చేరానన్నారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్,ప్రస్తుత జడ్పీటీసీ స్వారక్క నరసింహమూర్తి, అమరాపురం మండల బీసీసెల్ అధ్యక్షుడు చెన్నప్ప పాల్గొన్నారు.

ఈ ఖాతాలకు బారులు తీరిన ప్రజలు

అగళి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం ఈ ఖాతాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించిన వెంటనే పట్టణ వ్యాప్తంగా మునిసిపల్ కార్యాలయానికి గురువారం వేల సంఖ్యలో ప్రజలు వచ్చి బారులు తీరారు. జిల్లా కలెక్టర్ నుంచి అనుభవించబడిన లేఅవుట్లకు ఈ ఖాతాలో, రెవెన్యూ లేఅవుట్లకు బి ఖాతాలు అనుమతి పొందవచ్చని ప్రభుత్వం ప్రకటించినందున ఇప్పటి వరకు ఈ ఖాతాల కోసం ఎదురుచూసిన పట్టణవాసులు ఒక్కసారిగా మునిసిపల్ కార్యాలయం వద్ద క్యూకట్టారు. రెండు రోజులకే 1200కుపైగా ఈ ఖాతాలు, బి ఖాతాలు నమోదుచేసినట్లు అధికారులు తెలిపారు. మూడునెలల్లోపు ఈ ఖాతాలు చేయించుకోవడానికి గడువు ప్రకటించడంతో అంతలోపే తమ ఇళ్లకు ఖాతాలు చేయించుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

న్యూస్ బాక్స్

మహిష వీరంగం


భయభ్రాంతులకు గురిచేస్తున్న దున్నపోతు

చిలమత్తూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవతల కోసం గ్రామాల్లో దేవర దున్నపోతులను వదులుతుంటారు. సహజంగా అవి ప్రశాంతంగా గ్రామాల్లో తిరుగుతుంటాయి. మండలంలోని కోట్లోపల్లి గ్రామానికి వారం రోజుల క్రితం ఒక దున్నపోతు ఎక్కడనుంచో వచ్చింది. వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. దాని దెబ్బకు చిన్నారులు, వృద్ధులు బయటికి రావడానికి భయపడుతున్నారు. అది ఎప్పుడు ఎక్కడ నుంచి వచ్చి దాడి చేస్తుందోనని రోడ్డుపై వెళ్లడానికి కూడా జనం భయపడుతున్నారు. ప్రమాదకరంగా మారిన దీనిని గ్రామం నుంచి తరలించాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు పరిగి విద్యార్థినులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పరిగి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్మవరం యశోద కాన్సెప్ట్ స్కూల్‌లో ఈనెల 16న జరిగిన జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పరిగి విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. పరిగి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని మంజుళ, 9వ తరగతి హర్షవల్లిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు శుక్రవారం కర్నూలు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం కృపాసత్యరాజ్ తెలిపారు. తల్లిదండ్రులు, గ్రామస్థులు వారిని అభినందించారు.

రైతులు భూములను కంప్యూటరీకరణ చేసుకోండి

గుడిబండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రైతులు తమ భూములను కంప్యూటరీకరణ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి వీరనరేష్ పేర్కొన్నారు గురువారం మండలంలోని రాళ్లపల్లి, శంకరగల్లు గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూములను కంప్యూటరీకరణ చేయించుకొంటేనే ఇన్‌పుట్‌సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. రైతులు వెంటనే రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఆధార్‌కార్డు, పాసుపుస్తకం, ఫోన్ తీసుకెళ్లి తమ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

యథేచ్ఛగా రాళ్ల తరలింపు


గుట్ట నుంచి నల్లరాళ్లను తరలిస్తున్న ట్రాక్టర్

లేపాక్షి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): లేపాక్షి, కొండూరు పొలాల్లో ఉన్న నల్లరాళ్ల గుట్టల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఓ అగ్రిఫామ్‌హౌస్‌కు నల్లరాళ్లను తరలించేస్తున్నారు. అగ్రి ఫామ్‌హౌస్ పేరుతో ప్రభుత్వ భూముల్లోని నల్లరాళ్లను మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా సిబ్బంది పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. అగ్రి ఫామ్ హౌస్ నిర్వహిస్తున్న గుత్తేదారుడు ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే వారి పేర్లను వాడుకుని అధికారులను భయపెడుతున్నాడని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని విమర్శించారు.

ఆస్తి హక్కులో ఆడపిల్లలకు సమాన భాగం


మాట్లాడుతున్న ప్రత్యేక కోర్టు న్యాయాధికారి రమణయ్య

హిందూపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆస్తిలో ఆడపిల్లలకు కూడా సమాన భాగం ఉంటుందని హిందూపురం ప్రత్యేక కోర్టు న్యాయాధికారి రమణయ్య అన్నారు. గురువారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సామాజిక సమస్యలపై న్యాయ విజ్ఞానసదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం దృష్టిలో ఉందరూ సమానమేనని పేద, ధనిక తారతమ్యం ఉండదన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పించండి: ఆర్డీఓ


విద్యార్థులతో కలిసి అల్పాహారం రుచిచూస్తున్న ఆర్డీఓ

లేపాక్షి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టల్ విద్యార్థులకు వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం వడ్డించి అన్ని సౌకర్యాలు కల్పించాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ అన్నారు. గురువారం లేపాక్షి బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ గదిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం భుజించారు. తహసీల్దార్ సౌజన్య లక్ష్మీ, హాస్టల్ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

వేళాపాళా పాటించని రైతు సేవాకేంద్రం

గుడిబండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం అధికారులు వేళా పాళా పాటించకపోవడంతో రైతులు కార్యాలయం ముందు పడిగాపులు పడుతున్నారు. ఈ కేంద్రం పరిధిలో మోపురుగుండు, సింగేపల్లి, ఎస్.ఆర్.హట్టి, కేజీఎన్‌పాళ్యం, గుడిబండ గ్రామాలు ఉన్నాయి. రైతులు గురువారం తమ భూములను కంప్యూటరీ కరణ చేసుకొనేందుకు ఉదయం 10 గంటలకే రైతు సేవా కేంద్రానికి వచ్చారు. అయితే సిబ్బంది 11.30 గంటలైనా వచ్చి కార్యాలయాన్ని తెరవలేదు. గుడిబండ రైతు కేంద్రం సిబ్బంది అగళి మండలంలో నివాసం ఉంటున్నారు. అందుబాటులో ఉండాలని రైతులు కోరుతున్నారు.

బడుగుల ఆశాజ్యోతి బేడీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ


ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

పెనుకొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత అసంఘటిత కార్మికుల్లో చైతన్యం తీసుకొచ్చి, వారి హక్కుల సాధన కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహించిన ఘనత యంగ్ ఇండియా ప్రాజెక్ట్ వ్యవస్థాపకుడు దివంగత నరేంద్రసింగ్‌బేడీకే దక్కుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ అన్నారు. స్థానిక ముస్లిం మైనార్టీ ఫంక్షన్ హాలులో నరేంద్రసింగ్‌బేడీ సంస్మరణ సభను గురువారం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య తదితరులు హాజరయ్యారు. ముందుగా నరేంద్రసింగ్‌బేడీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం రామక్రిష్ణ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య పెత్తందారి వ్యవస్థలకు వ్యతిరేకంగా అసంఘటిత కార్మికుల్లో చైతన్యం తీసుకురావడానికి జాతీయస్థాయి వరకు వ్యవసాయ కూలీల సంఘాలను ఏర్పాటు చేసి ఉద్యమాలను నిర్వహించారని అన్నారు. ఆయన పోరాటంతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం, వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, పంచాయతీరాజ్ చట్టం తదితర అనేక పేదల ప్రయోజనకరమైన పథకాలు, చట్టాలు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో బేడీ సతీమణి సోనియాబేడీ, కుటుంబ సభ్యులు, సీనియర్ ప్రతినిధులు, కృష్ణమూర్తి, వెంకటస్వామి, బలరాం, రాజారెడ్డి, కిష్టప్ప, టింబక్టివ్ బబ్లుమేరి, భానూజ, వెంకటేశులు, రామాంజనేయులు, కేశవయ్య, అశ్వర్థమ్మ, నందగోపాల్, భక్తర్‌వలి, శివరామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు పోటెత్తిన అభ్యర్థులు


దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్న మునిసిపల్ కార్యాలయం

హిందూపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఏ కులానికి సంబంధించి సబ్సిడీ రుణాలు ఇవ్వలేదు. కానీ కూటమిప్రభుత్వం వచ్చాక కార్పొరేషన బలోపేతం చేస్తూ నిధులు కేటాయించారు. దీంతో బీసీ, కాపు, ఈబీసీ, కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోమని అధికారులు కోరారు. ఇందుకుగాను హిందూపురం పట్టణంలో 150యూనిట్లకుగాను వెయ్యిమంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి దరఖాస్తులను గురువారం మునిసిపల్ కార్యాలయంలో బ్యాంకర్లతో కలిసి అధికారులు పరిశీలించారు. దరఖాస్తుచేసుకున్నవారితోపాటు మరో వెయ్యి మంది రావడంతో కార్యాలయం కిటకిటలాడింది. దరఖాస్తులను మునిసిపల్ ఛైర్మన్ రమేష్, కమిషనర్ సంఘం శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్ బలరాంరెడ్డి, కౌన్సిలర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో కార్పొరేషన్లు నిర్వీర్యం చేశారని కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని బలోపేతం చేసి నిధులుకేటాయించడంతో సబ్సిడీ రుణాలకు భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయన్నారు.

సరస్వతీ కటాక్షం ఉంటే లక్ష్మీదేవి మీ వెంటే..

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): చదువులతల్లి సరస్వతీదేవి కటాక్షం ఉంటే లక్ష్మీదేవి వెంటనే ఉంటుందని మునిసిపల్ ఛైర్మన్ డి.ఇ. రమేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణ పరిధి చిన్నమార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల కళాశాలలో సరస్వతీ పూజ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇది పరీక్ష సమయమని, సమయం వృధా చేయకుండా ఏకాగ్రతతో చదివితే విజయం మీ భానిసవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలుఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ అనురాధ, కురుబ సంఘం రాష్ట్ర డైరెక్టర్ పరిమళ, కౌన్సిలర్ అయూబ్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూచేపల్లి గ్రామానికి చెందిన వివాహిత జ్యోతి క్రిమిసంహారక మందు తాగి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అప్పులవారు వచ్చి ఇంటివద్ద గొడవ చేయడంతో ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు బంధువులు తెలిపారు. ఆమెను గోరంట్ల ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సచేసి హిందూపురం తరలించారు.

వెలుగు సిబ్బంది ఘర్షణ

గోరంట్ల, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి సంబంధించి గతంలో వెలుగు యానిమేటర్‌గా పనిచేస్తున్న చాకలి వరలక్ష్మితో వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న నాగమణి, చంద్రశేఖర్, సుధాకర్ ఘర్షణపడి దుర్భాషలాడడంతో ముగ్గురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. చాకలి వరలక్ష్మిని గతేడాది నవంబరులో విధులనుంచి తొలగించారు. ఆమెకు సంబంధించి ఆరు నెలల వేతనం అందాల్సి ఉండడంతో ఆమె వెలుగు కార్యాలయానికి వెళ్లి విషయం అడిగారు. ఈసందర్భంగా చంద్రశేఖర్, సుధాకర్, నాగమణిలు గొడవపడి తనను దూషించినట్లు చాకలి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పౌర కార్మికుడి మృతి

పావగడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యంతో పౌర కార్మికుడు మృతిచెందిన సంఘటన గురువారం మధ్యాహ్నం పట్టణంలోని శనిమహాత్ముని ఆలయం ముందు చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆ కార్మికుడు చెత్తను ట్రాక్టర్లో వేసి తరలిస్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాక్టర్ నడపడంతో మంజునాథ్(38)ట్రాక్టర్ కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. వైద్యం నిమిత్తం అతడిని తుమకూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులుతెలిపారు. సంఘటనా స్థలానికి సురేష్, మునిసిపల్ ముఖ్య అధికారి జాఫర్‌షరీఫ్, అధ్యక్షుడు రాజేష్, కౌన్సిలర్లు పరిశీలించారు.

చింతపండు ధరలు

హిందూపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పురం మార్కెట్‌యార్డులో గురు వారం చింతపండు ధరలు నిలకడగా ఉన్నాయి. మార్కెట్‌కు వెయ్యి క్వింటాళ్లవరకు చింతపండు రాగా ఇందులో కర్పులి మొదటిరకం క్వింటాల్ రూ.31వేలు, రెండోరకం రూ.15వేలు, మూడో రకం రూ.8వేలు పలికింది.